తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
గురువారం
8 అక్టోబర్ 2026
పేజీలు - 12

# ఎన్నికల అక్రమాలపై విచారణ జరపాలి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- ఎమ్మెల్యేలు ప్రకాష్ రెడ్డి, నాగరాజు, యశస్విని రెడ్డి
- కుడా చైర్పర్సన్ గుండు సుధారాణి తదితరులు
- వరంగల్లో జనసంద్రంగా మారిన ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర...




వరంగల్ బ్యూరో, అక్టోబర్ 07 (జనం సాక్షి) : ఎన్నికల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు ప్రకాష్ రెడ్డి, నాగరాజు, యశ్వసిని, రెడ్డి, గుండు సుధారాణి, ఝాన్సీ రెడ్డి, అఖిపక్ష నాయకులు శ్రీనివాస రావు, బస్మియా, సాగర్, సత్యనారాయణ, నవీద్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ గారి ఆధ్వర్యంలో, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల సహకారంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బుధవారం వరంగల్లో భారీ అఖిలపక్ష పాదయాత్ర నిర్వహించారు. వరంగల్ పోచమ్మైదాన్ సెంటర్ నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ఈ పాదయాత్రలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వార్త మెయిన్ 3లో

# వరంగల్లో అయోధ్య రామ మందిరం!

- అద్భుతమైన సెట్టింగ్స్
- ప్రజలను ఆకర్షిస్తున్న పరిస్థితి
- ఓం చండేశ్వరి ఎగ్జిబిషన్ కు తరలివస్తున్న నగర ప్రజలు

వరంగల్ బ్యూరో, అక్టోబర్ 07 ( జనం సాక్షి) : ఎక్కడో ఉన్నటువంటి అయోధ్య రామ మందిరాన్ని వెళ్లి చూడలేని వాళ్ళు వరంగల్లో చూడవచ్చు. ఆ అనుభూతిని ఆనందాన్ని పొందవచ్చు. వరంగల్ నగరంలోని హంటర్ రోడ్ లో ఓం చండేశ్వరి ఎగ్జిబిషన్ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్పర్సన్ గుండు సుధారాణి తదితరులు ప్రారంభించారు.

వార్త మెయిన్ 7లో





# నకిలీ లోన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ నేరాలపై అవగాహన కు ప్రత్యేక ప్రచారం
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్

ములుగు ప్రతినిధి, అక్టోబర్ 7 (జనం సాక్షి): సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణపై రూపొందించిన అవగాహన పోస్టర్ను ఆవిష్కరించారు.

వార్త మెయిన్ 7లో

# ప్రజా పాలన గ్రామసభల పేరిట వచ్చిన నిధులను నొక్కేశారు

- వసూలు చేసిన రూ. 38 వేలు ఏమైనట్లు
- మండల పరిషత్ అభివృద్ధి అధికారి పేరిట వసూల్లు
- అధికారుల పనితీరు పై పలు గ్రామాల సర్పంచ్ల అసహనం




**నర్సంపేట, అక్టోబర్ 7 :( జనం సాక్షి)** ప్రజా పాలన గ్రామసభల పేరిట ప్రభుత్వం నుండి మంజూరైన నిధులలో నుండి రూ. 38 వేలు నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు నొక్కేశారు. నర్సంపేట మండలంలోని 19 గ్రామాలకు ప్రజా పాలన గ్రామసభల ఖర్చుల పేరిట రూ. 1.90 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులలో నుండి గ్రామానికి రూ. 2 వేల చొప్పున మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళ అధికారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఖర్చుల పేరిట ఇవ్వాలంటూ వసూలు చేసినట్లు పలు గ్రామాల సర్పంచులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ విషయం నర్సంపేట మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే..... నర్సంపేట మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జూన్ నెలలో ప్రజా పాలన గ్రామసభలను వారం రోజులపాటు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ఖర్చులను గ్రామ సర్పంచ్‌లే భరించుకున్నారు. ప్రజా పాలన గ్రామసభల ఖర్చులకు గాను ప్రభుత్వం ఆగస్టు నెలలో ఒక్కొక్క గ్రామానికి రూ. 10 వేల చొప్పున 19 గ్రామాలకు రూ. 1.90 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులను మండల పరిషత్ కార్యాలయానికి పంపించగా వీటిని ఒక్కొక్క గ్రామ సర్పంచ్ కు రూ. 10వేల చొప్పున అందించాల్సి ఉంది. కానీ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళ అధికారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఇవ్వాలంటూ రూ. 2 వేల చొప్పున రూ. 38 వేలు తీసుకొని ఒక్కొక్క గ్రామానికి రూ. 8 వేల చొప్పున మాత్రమే సర్పంచులకు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఇంతకు ఈ డబ్బులను ఎందుకు వసూలు చేశారని పలు గ్రామాల సర్పంచులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వసూలు చేసిన డబ్బులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మరో మహిళ అధికారిని ఇద్దరు పంచుకున్నట్లు జోరుగా చర్చ కొనసాగుతుంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా పాలన గ్రామసభల పేరిట వచ్చిన డబ్బులు గ్రామాల వారీగా పూర్తిస్థాయిలో పంపిణీ అయ్యాయా.. లేదా... అని విచారణ జరిపి వసూల్లు చేసిన బాధ్యుల పై చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో ప్రజా పాలన గ్రామసభల డబ్బులు గ్రామాల వారిగా పూర్తిస్థాయిలో అందించే విధంగా చూడాలని పలు గ్రామాల సర్పంచ్లు కోరుతున్నారు.

# అర్హత లేని వ్యక్తులచే అల్లోపతి వైద్యం చేయడంపై టీజీఎంసి కఠిన చర్యలు





**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 07 (జనం సాక్షి)** తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టిజీఎంసి) ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో ఎంబిబిఎస్ లేదా చట్టబద్ధమైన వైద్య అర్హత లేకుండా "డాక్టర్"గా ప్రజలకు వైద్యం అందిస్తున్నట్లు గుర్తించిన ముగ్గురు వ్యక్తులపై వరంగల్--హనుమకొండ ప్రాంతాల్లో పోలీసు కేసులు (ఎస్ ఐ ఆర్ లు) నమోదు చేయబడ్డాయి. నీ మేరకు పీజీఎంసి అధికారుల పేర్కొన్నారు. 1. గుర్రపు రామకృష్ణ,, ఫోర్ట్ వరంగల్, వరంగల్ ఎఫ్ఐఆర్ నం. 741/2026, ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్, తేదీ 02-10-2026. ఎంబిబిఎస్ అర్హత లేకపోయినా డాక్టర్‌గా ప్రజలకు ప్రచారం చేసుకుంటూ అల్లోపతి వైద్యం, మందులు మరియు ఇంజెక్షన్లు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనిఖీలో నొప్పి నివారణ మందులు, యాంటీబయాటిక్స్, క్యాన్యులా తదితర వైద్య పరికరాలు మరియు షెడ్యూల్-హెచ్ మందులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా కేసు నమోదై, ఛార్జ్‌షీట్ దాఖలైనట్లు పేర్కొనబడింది. 2. ఏ. కుమారస్వామి,రాజ రాజేశ్వరి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, సోమిడి రోడ్, విష్ణుపురి, కాజీపేట,ఎఫ్ఐఆర్ నం. 283/2026, కాజీపేట పోలీస్ స్టేషన్, తేదీ 02-10-2026. ఎంబిబిఎస్ అర్హత లేకపోయినా అల్లోపతి వైద్యం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనిఖీలో నొప్పి నివారణ మందులు, యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, రేబీస్ మరియు టీటీ వ్యాక్సిన్లు ఇవ్వడం, పిల్లల కేసులు చూడడం, చికిత్స అందించడం వంటి విషయాలు నమోదు చేయబడ్డాయి. గతంలో కూడా కేసు నమోదైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 3. బి. సుధాకర్రే సాయి తేజ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, సోమిడి రోడ్, విష్ణుపురి, కాజీపేటఎఫ్ఐఆర్ నం. 284/2026, కాజీపేట పోలీస్ స్టేషన్, తేదీ 03-10-2026. ఎంబిబిఎస్అర్హత లేకపోయినా అల్లోపతి వైద్యం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ ఇంజెక్షన్లు మరియు ద్రవాలు ఉపయోగించినట్లు, షెడ్యూల్-హెచ్ మందులను ఆధారాలుగా స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఐఆర్లో పేర్కొన్నారు. ఈ వ్యక్తిపై గతంలో కూడా కేసు హాలో నమోదైనట్లు ఫిర్యాదులో ఉంది.వైద్యం చేయించుకునే ముందు డాక్టర్ పేరు, ఎంబీబీఎస్/ పీజీ అర్హత మరియు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నిర్ధారించుకోవాలి. సమస్య ఉంటే ఈ వాట్సాప్ నెంబర్‌కి 9154382727 పంపించాలని టీజీఎంసీ అధికారులు డా యెగ్గన శ్రీనివాస్, డా కె. రవి కుమార్, డా కె. విష్ణు కో అప్ట్,డా కె.వెంకట స్వామి జిల్లా ఆంటీ క్వాకరీ బృందం సభ్యులు :డా ఎస్. శిరీష్ కుమార్ తదితరులు తెలిపారు.

# రైతన్న కష్టానికి కరెంట్ కోతలే శాపమా?

## 24 గంటల విద్యుత్ ఇవ్వాలి అన్నదాతను ఆదుకోవాలి! బిఆర్ఎస్ నేత లోలం శ్యాంసుందర్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 07,(జనంసాక్షి ):**ముధోల్ నియోజకవర్గంలో రైతన్నకు ప్రకృతి కన్నా.. విద్యుత్ కోతలే పెద్ద సవాల్‌గా మారుతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది. పంటలు చేతికొచ్చే కీలక సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతు ప్రతినిధులు డిమాండ్ చేశారు. రైతుల విద్యుత్ సమస్యలపై బి ఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటం వల్ల రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలో కరెంట్ అందకపోతే పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.కరెంట్ కోతలు,తక్కువ వోల్టేజీ, సరఫరాలో అంతరాయాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతులు పొలాల్లో రాత్రింబవళ్లు కష్టపడుతూ పంటలు సాగు చేస్తున్నారని,వారి కష్టానికి తగిన ఫలితం దక్కాలంటే విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం,విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు, విద్యుత్ అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీలోకి చేరిక



**మహా ముత్తారం అక్టోబర్ 7 (జనం సాక్షి)** కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని సర్పంచ్ కొండ గొర్ల బాపు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మహా ముత్తారం మండల కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ మహిళ నాయకులు, రామిల్ల లక్ష్మీ గంధం నరసక్క,కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి గ్రామ సర్పంచ్ మరియు కాటారం డివిజన్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొండ గొర్ల బాపు ఆహ్వానించి సంతోషం వ్యక్తం చేశారు. వారితోపాటు మాజీ జెడ్పిటిసి లింగమల్ల శారద, దుర్గయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటి లచ్చయ్య గౌడ్, వార్డు సభ్యుడు కొండ నితిన్, యువజన కాంగ్రెస్ నాయకులు కొండ సుమన్ జాడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అందరూ సహకరించాలి

- రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి
- కార్మికశాఖా మంత్రి డా.వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 07(జనంసాక్షి):** ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ సహకరించాలని రాష్ట్ర మంత్రి డా.వివేక్ వెంకటస్వామి కోరారు.మందమర్రి మున్సిపాలిటీ వెంకటాపూర్‌లో రూ.3 కోట్లతో నిర్మించనున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ ఎస్.ఈ.బాణోత్ రాజన్న, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామ భవిష్యత్ అవసరాల దృష్ట్యా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వెంకటాపూర్‌లో 32 ఇందిరమ్మ ఇళ్లు, 38 పెన్షన్లు మంజూరయ్యాయని చెప్పారు. ఎమ్మెల్యే కాలనీ నుంచి ఆర్కే-5 వరకు 4.7 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.4.85 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం 70 మంది శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం మందమర్రి మున్సిపాలిటీలో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 24 వార్డుల్లో రూ.15 కోట్లతో పనులు చేపడుతున్నామని, త్వరలో మరో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అమృత్ పథకంతో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



**నెన్నెల, అక్టోబర్ 6 జనంసాక్షి):** కోనంపేటలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం పోలీసులు పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేకాటకు వినియోగిస్తున్న రూ.6,860 నగదు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పేకాటకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నా, పేకాట ఆడుతున్నా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ప్రజల సహకారంతో అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# ప్రజాసేవలో ప్రధాని మోడీ పాతికేళ్ల ప్రస్థానం

**దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మైలురాయి**

**బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి**



**వరంగల్ మండలం, అక్టోబర్ 07 (జనం సాక్షి)**భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి అధ్యక్షతన వరంగల్ చౌరస్తాలో బుధవారం "వికసిత్ సంకల్ప సభ" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.ప్రభుత్వాధినేతగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకోవడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక అరుదైన, అద్భుతమైన మైలురాయి అని నాయకులని, పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రధాని మోడీ పాలన ప్రపంచ దేశాలకే దిక్సూచిగా మారిందన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్' గా మార్చేందుకు ప్రధాని చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు.దేశ రాజధాని ఢిల్లీ నుంచి ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశ ప్రజలను, బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు తరలివచ్చిన ప్రజలు మరియు కార్యకర్తలు స్క్రీన్లపై వీక్షించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి , జిల్లా ఇన్చార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు హాజరయ్యారు. ప్రధాని మోడీ ప్రసంగం దేశాభివృద్ధికి, వికసిత భారత్ నిర్మాణానికి దిక్సూచిలా నిలిచిందని, కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.ప్రధాని ప్రసంగం అనంతరం, సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ చౌరస్తాలో "సేవా జ్యోతి కలశయాత్ర"ను నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ యాత్ర వరంగల్ చౌరస్తా నుండి కొత్తవాడ వరకు కార్యకర్తల నినాదాలు, దేశభక్తి స్ఫూర్తితో ఉత్సాహంగా సాగింది.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, సేవా జ్యోతి రాష్ట్ర కో కన్వీనర్ సిద్ధం నరేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎర్రగొల్ల భరత్ వీర్, కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్ మరియు జిల్లా పదాధికారులు వివిధ మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు కార్యకర్తలు, మహిళలు, నగర ప్రజలు పాల్గొన్నారు.

## తంగేడు మొక్కలు నాటిన ఎమ్మెల్యే , ప్రతి ఇంటా తంగేడు మొక్క నాటాలి

**ఎమ్మెల్యేగండ్ర సత్యనారాయణరావు**



**శాయంపేట, అక్టోబర్ 7 (జనం సాక్షి)**శాయంపేట మండలంలోని మందారిపేట గ్రామంలో ప్రారంభమైన తంగేడు మొక్కల పెంపక ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆకాంక్షించారు. బుధవారం మందారిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తంగేడు మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంగేడు తెలంగాణ రాష్ట్ర పుష్పమని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు తంగేడు పుష్పం ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ పండుగతో తంగేడు పుష్పానికి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు.మందారిపేటలో మొదలైన ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగాలిమందారిపేటలో ప్రారంభమైన తంగేడు మొక్కల పెంపక కార్యక్రమం స్ఫూర్తిగా నిలవాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఇంటిలో ఒక్క తంగేడు మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, రహదారుల వెంట, చెరువు కట్టలు, ప్రభుత్వ స్థలాల్లో తంగేడు మొక్కలను విస్తృతంగా నాటాలని సూచించారు. తెలంగాణ అంతటా తంగేడు మొక్కల పెంపకం జరిగేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.తంగేడు మొక్కల పెంపక ఉద్యమాన్ని చేపట్టి గ్రామస్థులు, యువతలో అవగాహన కల్పిస్తున్న ఉద్యమ అధ్యక్షుడు బడుగు సునీల్ ను ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని అన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన, కార్యదర్శి అజయ్, ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, కుక్కల తిరుపతి, మాజీ మార్కెట్ ఛైర్మన్ రేణుకుంట్ల సదయ్య, బూర ఈశ్వరయ్య, బొట్టు రత్నాకర్, వలుస తరుణ్, గాజర్ల శంకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువకులు, తంగేడు మొక్కల కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ హనుమకొండలో భారీ ధర్నా

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం**

**హాజరైన ఎమ్మెల్యేలు నాయిని ,కేఆర్ నాగరాజు**



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు జిల్లా నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఎంపీలు చేపట్టిన భారీ నిరసన ర్యాలీపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా దాడి చేయించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో డిసిసి కార్యాలయం చౌరస్తాలో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్. నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ. దేశంలో ఓట్ల తొలగింపు, ప్రక్రియ లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తే ఒక లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తో పాటు ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం ప్రజా స్వామ్య విధానాలకు గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజా స్వామ్య యుతంగా, శాంతి యుతంగా ఈ.సి ముందు దీక్ష చేసేందుకు వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం చాలా దారుణం అని అన్నారు.ఇండియా కూటమి నాయకులు దేశంలో ఒక అతిపెద్ద సమస్యపై పోరాటం చేస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇలా అడ్డుకోవడం నియంత పాలనకు పరాకాష్ట అన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ కార్పొరేషన్ల జిల్లా ఛైర్మన్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ తదితరులు పాల్గొన్నారు

## పీఎం శ్రీ పాఠశాలలో వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 7 (జనం సాక్షి) :**హసన్ పర్తి లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని వసతులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సీసీ కెమెరాల పనితీరు, కిచెన్ షెడ్, కిచెన్ గార్డెన్ లో పెంచుతున్న మొక్కలు, పాఠశాల పై సమావేశాలు, యోగ శిక్షణకు ఏర్పాటు చేసిన షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమా దేవి వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో అనేక సదుపాయాలను కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, స్థానిక తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సేవా జ్యోతి కలశ యాత్రలో ఏలేటి



**నిర్మల్ టౌన్ : అక్టోబర్ 07,(జనంసాక్షి )** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను స్మరించుకుంటూ నిర్మల్‌లో నిర్వహించిన 'సేవా జ్యోతి కలశ యాత్ర'లో బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్.కె. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు.అనంతరం మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రధాని సేవా స్ఫూర్తి, సంకల్పం, దేశాభివృద్ధి పట్ల ఆయన అంకితభావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే యాత్ర ఉద్దేశమని నాయకులు తెలిపారు.కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, జిల్లా ఇన్చార్జి గోపిడి శ్రావణి రెడ్డి, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో గిరిజన రైతు గేదె మృతి

**నష్టపరిహారం అందించాలని రైతు వేడుకోలు**



**నెరడిగొండ అక్టోబర్7(జనంసాక్షి):**మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ గంగారాం గిరిజన రైతు గేదె మంగళవారం నాడు గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి పేద గిరిజన రైతుకు చెందిన గేదె మృతి చెందింది.మేత కోసం వెళ్లిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని రైతు వాపోయాడు.ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఆర్థింగ్‌లో లోపం కారణంగానే గేదెకు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు సంబంధిత అధికారులు పరిశీలన అనంతరం గుర్తించినట్లు సమాచారం. ఘటనపై స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో సంబంధిత సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.పేద గిరిజన రైతుకు చెందిన గేదె మృతి చెందడంతో కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న రైతుకు ఈ నష్టం మరింత భారంగా మారిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి,ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధిత రైతుకు నష్టపరిహారం ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఏజెన్సీలో 1970 తరువాత గిరిజనేతరుల అక్రమ పట్టాలు రద్దు చేయాలి

- ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్ )
- ఏజెన్సీలో వలసలను నిరోధించాలి
- 1/70 చట్టం విషయంలో ఆదివాసీల తరపున ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిపిటిషన్ దాఖలు చేయాలి



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 7(జనం సాక్షి ):-** షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేశారు. బుధవారం ఫారెస్ట్ గెస్ట్ హౌస్ ఆవరణంలో ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జాక్ )సమీక్ష సమావేశం ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి అధ్యక్షతన నిర్వహించారు..ఈ సమావేశంలో తుడుం దెబ్బ జాతీయ రాష్ట్ర ఉపాధ్యక్షులు యాసం రాజు, ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి, గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్సిక సతీష్, వెంకటాపురం ఆదివాసి మహిళా అధ్యక్షురాలు జెజ్జరి నారాయణమ్మ మాట్లాడారు. ఏజెన్సీ వెంకటాపురం వాజేడు మండలాలలో భూప్రక్షాళనలో భూ అక్రమ పట్టాలు వలస గిరిజ నేతలు చేయించుకున్నారని అన్నారు. వెంకటాపురం మండలంలోని వాడగూడెం (జి),వాడగూడెం(జెడ్) రెవెన్యూ గ్రామాలలో వలస గిరిజనేతరులకు రెవెన్యూ అధికారులు అక్రమ పట్టాలు చేశారని విమర్శించారు. వాజేడు, వెంకటాపురం రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు గిరిజనేతర్ల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములకు ఫోర్జరీ కాగితాలు తయారు చేయించుకునే సలహాలిస్తూ అక్రమ పట్టాలకు ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపించారు. గిరిజనులు సాగు చేసుకుంటూ పట్టాలు కలిగి ఉన్నప్పటికీ గిరిజనేతరులు గిరిజనులను బెదిరించి పట్టా భూములను ఆక్రమించుకుంటుంటే వాజేడు వెంకటాపురం మండలాల రెవిన్యూ అధికారులు చోద్యం చూస్తూ ఉన్నారని ఆగ్రహించారు.భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, 1/70 చట్టాన్ని రద్దు చేయాలని,కేబినెట్ మంత్రిగా పనిచేస్తున్న వారి కుటుంబానికి చెందిన కొందరి వ్యక్తులతో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినారని,ఆ గిరిజనేతరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మరియు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలోనే జీవిస్తూ ఆదివాసి చట్టంపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.1/70 చట్టానికి విరుద్ధంగా నివాసం ఉంటున్న గిరిజనేతరుల ఓటు హక్కును తక్షణమే రద్దుచేసి గిరిజనేతరులను మైదాన ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతంలో 1/70 కి విరుద్ధంగా వలసలు వచ్చి ప్రభుత్వ భూములపై కన్ను వేసి, వారి కుటుంబ సభ్యులను బినామీలుగా పెట్టుకొని,దౌర్జన్యంగా ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ ఆదివాసి చట్టంపై దాడి చేయడం ఏమిటని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.1/70 చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుంటే,గిరిజన రిజర్వేషన్ మీద అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు,నిద్రమత్తులో ఉన్నారా,లేక రాజకీయ పార్టీలకు ఆదివాసి చట్టాన్ని తాకట్టు పెట్టారో ఆదివాసి ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని వారు సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ భూభాగంలో 1/70 చట్టాన్ని ఆదివాసుల కోసం ప్రత్యేకంగా రూపొందించడం వల్లనే,ఈరోజు రిజర్వేషన్ తో ఆదివాసి ఎమ్మెల్యేలుగా అధికారంలో ఉన్నరని ఆ విషయం మర్చిపోతున్నారని అన్నారు.చట్టాన్ని రద్దు చేయాలని గిరిజనేతరులు మాట్లాడుతుంటే కనీసం ఆదివాసి ఎమ్మెల్యేలు ఇంతవరకు స్పందించలేకపోవడం చాలా దారుణమని అన్నారు. ఆదివాసి జాతిలో జన్మించి ఆదివాసి రిజర్వేషన్ తో ఎమ్మెల్యేలుగా గెలుపొంది. ఆదివాసి చట్టాలకు అతీతంగా పనిచేస్తున్నారని,ఏజెన్సీ ప్రాంతం నుండి బూర్జువ రాజకీయ పార్టీలను బహిష్కరించినప్పుడే ఆదివాసి చట్టాలు అమలకు నోచుకుంటాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు రాజకీయ పార్టీలకు అతీతంగా,పిసా గ్రామ సభలు తీర్మానాలు చేసి,గవర్నర్ పాలన కావాలని అన్నారు.1/70 చట్టం అమలుకై ఉద్యమాలు ఉధృతం చేయాలని ఆదివాసి యువతకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆదివాసి సాంప్రదాయాలు పాటించాలని, ఆదివాసి ఇతరులను వివాహం చేసుకొని ఆదివాసి జాతి అస్తిత్వానికి కొందరు ద్రోహులుగా మారుతున్నారని విమర్శించారు. ఇలాంటి వారి వల్ల జాతి మొత్తానికే పెను ప్రమాదం వాటిల్లుందని తెలియజేశారు. ఆదివాసి ఇతరుల తో సంబంధం పెట్టుకొని రాజకీయ రిజర్వేషన్లను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ తుడుం దెబ్బ జిల్లా నాయకులు చింత సోమరాజు, ఆదివాసి నవనిర్మాణ సేన ములుగు జిల్లా కన్వీనర్ కుంజ మహేష్ ,తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కనితి వెంకటకృష్ణ,మట్టి రమేష్, ఆదివాసీ నవనిర్మాణ సేన మండల అధ్యక్షులు వాసం నారాయణ, ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు తుర్సా కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో నేడు రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర

### కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై సక్సెస్ చేయాలి

### డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాజ్యాంగ పరిరక్షణ కోసం అఖిల పక్షాల ఆధ్వర్యంలో నేడు(గురువారం) భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని, కారక్రమానికి అధిక సంఖ్యలో హాజరై సక్సెస్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తెలిపారు. భూపాలపల్లిలో బుధవారం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీజేఎస్, సీపీఐ(ఎంఎల్) సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించాలని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, ఫారం-6లో తీసుకొచ్చిన మార్పులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సమాధానం ఇవ్వాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరారు. గురువారం ఉదయం పట్టణంలోని హనుమాన్ ఆలయం నుండి అంబేద్కర్ చౌక్ వరకు పాదయాత్ర ఉంటుందని, ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సోతుకు ప్రవీణ్ కుమార్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, సీపీఎం నాయకుడు ఆకుదారి రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, నేరెళ్ల జోసెఫ్, అఖిల్ కిషోర్, నాగరాజు, కోనూరి భగత్, మరాఠీ కాంతారావు, పోతుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

# డెయిరీ ఫార్మ్‌లను పరిశీలించిన పశువైద్యాధికారి



**రేగొండ (కొత్తపల్లిగోరి) 07అక్టోబర్ (జనం సాక్షి):** మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలోని డెయిరీ ఫార్మ్‌లను రేగొండ మండల పశు వైద్యాధికారి బాలకృష్ణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫార్మ్‌లలోని పాడి పశువుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, పశుపోషకులకు పలు సూచనలు చేశారు. శీతాకాలంలో చలి తీవ్రత కారణంగా పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశువులకు సమతుల్యమైన దాణా, స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పశువుల నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని సూచించారు. అలాగే పాడి పశువులకు ఇన్సూరెన్స్ చేయించడం ద్వారా అనుకోని నష్టాల నుంచి రక్షణ పొందవచ్చని, ప్రతి పశుపోషకుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలకృష్ణ సూచించారు. పశువుల్లో అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

# బిల్లా యాదవ రెడ్డిని పరామర్శించిన ఎర్రబెల్లి దయాకర్ రావు



**దేవరుప్పుల, అక్టోబర్ 07 (జనం సాక్షి)** దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బిల్లా యాదవ రెడ్డిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హైదరాబాద్‌లో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హార్ట్ స్టంట్ అనంతరం వైద్యుల సూచనలు పాటిస్తూ ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో పల్లా సుందర్ రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్, బిల్లా వెంకటేశ్వర్ రెడ్డి, చింత రవి, ఇప్ప పృథ్వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆగమన్‌కు సీఐ విశ్వేశ్వర్‌కు ఆహ్వానం




**గీసుకొండ మండలం, అక్టోబర్ 7, (జనం సాక్షి)** గీసుకొండ: గొల్లపల్లె యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గామాత ఆగమన్ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా గీసుకొండ సీఐ విశ్వేశ్వర్ను యూత్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు దుర్గామాత, ఆగమన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, యువత, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్వర్ణ కుమారి

**ములుగు ప్రతినిధి,అక్టోబర్ 7(జనం సాక్షి):-** ప్రభుత్వ వైద్య కళాశాల, దాని అనుబంధ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్య విభాగంలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.స్వర్ణ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 12న ఉదయం 11 గంటల నుంచి 17న మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అర్హతలు, దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్://జిఎంసిఎంఎల్‌యూజియూ. ఓఆర్‌జి ను సందర్శించాలని ఆ ప్రకటనలో ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# పి ఈ టి వేధిస్తున్నాడని రోడ్డెక్కిన విద్యార్థులు

### పోలీసుల రంగ ప్రవేశం తో ఆగిన ఆందోళన

### పి ఈ టి ని తొలగిస్తామని హామీ ఇచ్చిన ప్రిన్సిపల్



**ఖానాపూర్ అక్టోబర్ 07 (జనం సాక్షి)**నియోజకవర్గ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస ఇంటర్ కళాశాల లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ వేధింపులు శృతిమించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. బుధవారం కళాశాల నుండి బయటకు వచ్చిన విద్యార్థులు పట్టణంలోని ప్రధాన ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పి ఇ టి తమ పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు ఆరోపించారు. చిన్న చిన్న విషయాలకే తమను తీవ్రంగా శిక్షిస్తూ గోడ కుర్చీలు వేయిస్తున్నాడని, అకారణంగా వంగబెట్టి వీపుపై పిడిగుద్దులు గుద్దుతూ శారీరకంగా, మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన చెందారు. తమకు వెంటనే న్యాయం చేయాలని, సదరు పి ఇ టి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దెత్తున నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలియగానే ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ వెంటనే పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ హుటాహుటిన ఎన్టీఆర్ చౌరస్తా వద్దకు వచ్చి విద్యార్థులను సముదాయించారు. ఎస్ఐ, ప్రిన్సిపాల్ హామీతో విద్యార్థులు శాంతించి తమ ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ మాట్లాడుతూ.. "విద్యార్థులు పీఈటీ వేధింపుల విషయాన్ని ఇప్పటివరకు నా దృష్టికి తీసుకురాలేదని. సమస్య ఏదైనా ఉంటే కళాశాల యాజమాన్యంతో మాట్లాడాల్సింది కానీ, ఇలా నేరుగా రోడ్డుపై బైఠాయించడం బాధ కలిగించింది" అని అన్నారు. అయినప్పటికీ సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆయన తెలిపారు. సదరు పీఈటీని బాధ్యతల నుండి తక్షణమే తొలగించాలని మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయని, విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని ప్రిన్సిపాల్ స్పష్టమైన హామీ ఇచ్చారు.

## బతుకమ్మ ఘాట్ పరిశీలించిన ఛైర్పర్సన్



**బెల్లంపల్లి, అక్టోబర్ 7, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణం 7వ వార్డులోని బతుకమ్మ ఘాట్ ను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బుధవారం బెల్లంపల్లి మున్సిపల్ ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర పండగ బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో బతుకమ్మ ఆడే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న ఏర్పాట్లను, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆమె వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## వన్యప్రాణి వారోత్సవాలు



**సారంగాపూర్, అక్టోబర్ 7(జనం సాక్షి)**72వ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా నిర్మల్ జిల్లా, మలక్ చించోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల ప్రాముఖ్యత, జీవవైవిధ్య పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో విద్యార్థుల పాత్ర తదితర అంశాలపై ఉపన్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు మరియు మెమెంటోలు అందజేయనైనది. ఈ కార్యక్రమంలో రామకృష్ణ రావు, అటవీ క్షేత్రాధికారి, నిర్మల్, మహ్మద్ నజీర్ ఖాన్, ఉప అటవీ క్షేత్రాధికారి, సారంగాపూర్, పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయులు, ఇనాయతుద్దీన్, సీనియర్ అసిస్టెంట్, వెన్నెల, సుజాత అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



**బెల్లంపల్లి, అక్టోబర్ 7, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని, ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని, దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా 2012 ఏప్రిల్ 13న ప్రారంభించామన్నారు. దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు 440వ సారి బొద్దున ముత్యాలు 5వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో యాచకులకు, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా సుమారు 180 మందికి అన్నదానం చేశామన్నారు. ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత బొద్దున శ్రీనివాస్, జనహిత సేవా కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు కందుల రాజన్న, కార్యవర్గ సభ్యులు బిమిని కనకయ్య గౌడ్, నిచ్చకోల గురుస్వామి, బోనాల సతీష్, సాయి ఈశ్వర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు న్యాయమైన వాటా చెల్లించాలి

### విప్లవ కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్



**బెల్లంపల్లి, అక్టోబర్ 7, (జనంసాక్షి)**సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత సంవత్సరం చెల్లించిన రూ.5,000 లాభాల వాటాను ఈసారి కూడా యథాతథంగా చెల్లించడం కాకుండా, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం, కుటుంబ అవసరాలను పరిగణనలోకి తీసుకుని లాభాల వాటాను గణనీయంగా పెంచి చెల్లించాలని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గత సంవత్సరం రూ.5,000 చెల్లించారు. కానీ ఈ ఏడాది ధరలు పెరిగాయి, కార్మికుల కుటుంబాల ఖర్చులు పెరిగాయి, కాబట్టి అదే రూ.5,000ను కొనసాగించడం సమంజసం కాదన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, రవాణా, గనుల నిర్వహణ తదితర పనుల్లో కాంట్రాక్టు కార్మికులు కీలకంగా పనిచేస్తున్నారని, సంస్థ ఉత్పత్తి, లాభాల్లో వారి శ్రమకు కూడా భాగస్వామ్యం ఉందని, లాభాల వాటా విషయంలో కాంట్రాక్టు కార్మికులను విస్మరించకూడదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఈసారి లాభాల వాటాను ఎంత పెంచాలనే అంశాన్ని కేవలం యాజమాన్య నిర్ణయంగా కాకుండా కార్మికుల జీవన పరిస్థితులు, వారి శ్రమకు తగిన న్యాయమైన వాటాగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విప్లవ కార్మిక సంఘాల నాయకులు మణిరామ్ సింగ్, అంబాల మహేందర్, ఎం పోషమల్లు, లక్ష్మి, కృష్ణవేణి, రాధా తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు

### నెలవారీ తనిఖీలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,అక్టోబర్7(జనం సాక్షి):**-ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను, భద్రతా సిబ్బందిని ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రం లోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఈవీఎం గోదాం ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేసిన సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, నిరంతర నిఘా వ్యవస్థ, విద్యుత్ సరఫరా,అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాలను తనిఖీ చేశారు.అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర భద్రతాపరమైన సమస్యలు ఎదురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలపై సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు.గోదాంలో భద్రతా ప్రమాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు అమలయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఈవీఎం గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు.గోదాంను సందర్శించే ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఈవీఎంల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్,గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు,భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

### ఎంపీడీవో రాధా రాథోడ్



**ఖానాపూర్ అక్టోబర్ 07 (జనం సాక్షి)**మండలంలోని సింగపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్ మాట్లాడారు. సింగపూర్, గోండు గూడ గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి, గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కే క్రమం తప్పకుండా అందించాలని కోరారు. అందరూ భాగస్వాములై గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లత, ఉప సర్పంచ్ అర్జున్ లతోపాటు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

### కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 07 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు శీలం శ్యామ్, వొగ్గు రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో , జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులకు కార్యకర్తలకు బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, మాజీమంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజలతో కలిసి పనిచేయాలని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి గ్రామస్థాయిలో బలమైన కార్యకర్తలే అండగా నిలుస్తున్నారని అన్నారు. నమిలిగొండకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వ హిస్తూ బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కోటే తిరుపతి, బత్తిని సత్యనారాయణ, బొమ్మెర సంపత్, చిక్కుడు ఎల్లయ్య, పురమాని రవి, పుర మాని వెంకన్న, డ్యాగల రాజేందర్, కోల వెంకటేష్, సముద్రాల యాకూబ్ పాషా, గుండె నరసయ్య, మినుముల నర్సయ్య, కోల గట్టయ్య, గాదె మహేష్,గాదె శివాజీ, తాళ్లపల్లి సాయిలు,గాదె ప్రణయ్, గాదె వంశీధర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు కనకం గణేష్, జబ్బార్, ఆగారెడ్డి, గుండె మల్లేష్, గాదె రాజు, చిట్టిబాబు, గట్టు కృష్ణ సాయి పాల్గొన్నారు.

## బతుకమ్మ,దసరా ఉత్సవాల ఏర్పాట్ల పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్

### ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలి



**పరకాల,అక్టోబర్ 07, (జనంసాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలో మహిళలు అంగరంగ వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ ఆడుకునే అంగడి మైదానాన్ని,బతుకమ్మలు వేసే దామరచెరువు వద్ద చేయవలసిన ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది. మరియు దసరా ఉత్సవాల సందర్భంగా బొడ్రాయి ప్రాంతాన్ని గడి ప్రాంతాన్ని మరియు రథాన్ని తీసుకుపోయే చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ చేయవలసిన పనుల గురించి మున్సిపల్ అధికారులతో చర్చించి తగు సలహాలు సూచనలు ఇచ్చి, అట్టి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్.ఇట్టి కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్స్ నల్లెల్ల కుమార్,గూడెల్లి సదన్న,బండి శ్రీధర్,కొయ్యడా శ్రీనివాస్,పాలకుర్తి శ్రీను,సుదమల్ల రమేష్,అల్లె దశరథం,కుక్కల విజయ్ గార్లతో పాటుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్,ఏకు విద్యాసాగర్,పోరండ్ల వేణు,పసుల రమేష్,బొచ్చు సల్మాన్,గొడుగు నాగరాజు,బొచ్చు బాబురావు,ఆకుల శ్రీధర్,జాఫర్ రిజ్వి,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాజకుమార్ సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి మరియు మున్సిపల్ జవాన్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 07(జనంసాక్షి ):** జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామ సమాఖ్య భవనాలు మంజూరు కాగా 17 భవనాలు పూర్తి అయ్యాయని, 187 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయని, మిగతా భవనాల పనులను త్వరగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 100 జి.పి. భవనాలు మంజూరు కాగా 10 చోట్ల పనులు ప్రారంభం కాలేదని, ఇందుకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పనులు ప్రారంభించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ, మూత్రశాలలు, త్రాగునీరు వంటి మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణ పనులను చేపట్టాలని తెలిపారు. జిల్లాలో చేయూత పింఛన్ల కొరకు 9 వేల 466 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా అర్హుల జాబితాను రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని 8 వేల 163 స్వయం సహాయక సంఘాల బ్యాంకు లీకేజీ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందిరమ్మ మహిళా చీరల పంపిణీ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తిచేసేలా దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, పంచాయితీరాజ్ ఈ.ఈ. ధర్మేందర్, పంచాయితీ రాజు ఇంజనీరింగ్, టిజిఈడబ్ల్యూఐడిసి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ వర్ధిల్లి వెంకటేశ్వర్లు గౌడ్ బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి



**నర్సంపేట అక్టోబర్ 7( జనం సాక్షి)** డాక్టర్ వర్ధిల్లి వెంకటేశ్వర్లు గౌడ్ అనారోగ్యంతో నిన్న సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ వర్ధిల్లి వెంకటేశ్వర్లు గౌడ్ మృతి బాధాకరమని, ఆయన వైద్య వృత్తిలో సేవలను స్మరించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్ రావు, మండల శ్రీనివాస్, గిరగాని సాంబయ్య గౌడ్, పెండ్యాల యాదగిరి, రాయిరాకుల సారంగం, చుక్క అనిల్, కడారి కుమార్, దోనాల రవి, ముద్దంగుల రవి, బండి ప్రవీణ్, వేల్పుల శ్రీను, నీరటి రంజిత్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

## బాలికను తరగతి గదిలోనే ఉంచి తాళం

### ప్రధానోపాధ్యాయురాలు సస్పెన్షన్.. స్కావెంజర్ తొలగింపు



**నిర్మల్ బ్యూరో , అక్టోబరు 7:(జనంసాక్షి )** తరగతులు ముగిసిన తర్వాత రెండో తరగతి విద్యార్థిని పాఠశాల గదిలోనే ఉండిపోయినా గుర్తించకుండా తాళం వేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తానూర్ మండలం బెంబర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రధానోపాధ్యాయురాలు డి.స్వప్నను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన స్కావెంజర్‌ను విధుల నుంచి తొలగించారు. పాఠశాల ముగిసే సమయంలో ప్రతి విద్యార్థి సురక్షితంగా బయటకు వెళ్లాడా లేదా అనేది ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో భద్రతా చర్యలను ఎంతఓటు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వెంకటాపూర్ సబ్‌స్టేషన్‌లో 5ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ విజయవంతంగా ఛార్జ్





**వెంకటాపూర్(రామప్ప),అక్టోబర్ 07(జనం సాక్షి):-** వెంకటాపూర్ సబ్‌స్టేషన్‌లో పెరుగుతున్న విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పిటిఆర్) ను 07 అక్టోబర్ 2026న విజయవంతంగా ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఎస్‌ఈ బి.బిక్షపతి మాట్లాడుతూ 5 ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం ద్వారా సబ్‌స్టేషన్‌పై ఉన్న అధిక లోడ్ భారం తగ్గడంతో పాటు, వినియోగదారులకు ఎదురవుతున్న విద్యుత్ అంతరాయాలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అధిక లోడ్ సమస్యను దృష్టిలో ఉంచుకుని 5 ఎంవిఎ పిటిఆర్ ఏర్పాటు చేయడంతో వెంకటాపూర్ పరిధిలోని గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డివిజన్ డిఈ కె.రాజు, డిఈ ఎంఆర్టి ఽ కాంట్రాక్టర్స్ వి. జగదీశ్ బాబు, ఎడిఈ ములుగు ఎన్.వేణు గోపాల్, టిఆర్ఈ ఎస్పిఎం ఎడిఈ మధుసూదన్, వెంకటాపూర్ ఏఈ పి.రమేష్, సబ్ ఇంజనీర్ బి.సాంబరాజు మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా పాలన గ్రామసభల పేరిట వచ్చిన నిధులను నొక్కేశారు

## వసూలు చేసిన రూ. 38 వేలు ఏమైనట్లు

### అధికారుల పనితీరు పై పలు గ్రామాల సర్పంచ్ల అసహనం



**నర్సంపేట, అక్టోబర్ 7 :( జనం సాక్షి)**ప్రజా పాలన గ్రామసభల పేరిట ప్రభుత్వం నుండి మంజూరైన నిధులలో నుండి రూ. 38 వేలు నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు నొక్కేశారు. నర్సంపేట మండలంలోని 19 గ్రామాలకు ప్రజా పాలన గ్రామసభల ఖర్చుల పేరిట రూ. 1.90 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులలో నుండి గ్రామానికి రూ. 2 వేల చొప్పున మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళ అధికారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఖర్చుల పేరిట ఇవ్వాలంటూ వసూలు చేసినట్లు పలు గ్రామాల సర్పంచులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ విషయం నర్సంపేట మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే..... నర్సంపేట మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జూన్ నెలలో ప్రజా పాలన గ్రామసభలను వారం రోజులపాటు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ఖర్చులను గ్రామ సర్పంచ్ లే భరించుకున్నారు. ప్రజా పాలన గ్రామసభల ఖర్చులకు గాను ప్రభుత్వం ఆగస్టు నెలలో ఒక్కొక్క గ్రామానికి రూ. 10 వేల చొప్పున 19 గ్రామాలకు రూ. 1.90 లక్షలను మంజూరు చేసింది. ఈ నిధులను మండల పరిషత్ కార్యాలయానికి పంపించగా వీటిని ఒక్కొక్క గ్రామ సర్పంచ్ కు రూ. 10వేల చొప్పున అందించాల్సి ఉంది. కానీ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళ అధికారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఇవ్వాలంటూ రూ. 2 వేల చొప్పున రూ. 38 వేలు తీసుకొని ఒక్కొక్క గ్రామానికి రూ. 8 వేల చొప్పున మాత్రమే సర్పంచులకు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఇంతకు ఈ డబ్బులను ఎందుకు వసూలు చేశారని పలు గ్రామాల సర్పంచులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ వసూలు చేసిన డబ్బులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మరో మహిళ అధికారిని ఇద్దరు పంచుకున్నట్లు జోరుగా చర్చ కొనసాగుతుంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా పాలన గ్రామసభల పేరిట వచ్చిన డబ్బులు గ్రామాల వారీగా పూర్తిస్థాయిలో పంపిణీ అయ్యాయా.. లేదా... అని విచారణ జరిపి వసూల్లు చేసిన బాధ్యుల పై చర్యలు తీసుకొని పూర్తిస్థాయిలో ప్రజా పాలన గ్రామసభల డబ్బులు గ్రామాల వారిగా పూర్తిస్థాయిలో అందించే విధంగా చూడాలని పలు గ్రామాల సర్పంచ్లు కోరుతున్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

## ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్



**మంగపేట, అక్టోబర్ 07(జనంసాక్షి)**మండలంలోని కమలాపురం ఆదర్శ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏటూరు నాగారం ఏఎస్పీ మనం భట్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. అదే రీతిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ సైబర్ నేరాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను ఆకర్షణీయమైన ప్రకటనలకు లేదా మాటలకు మోసపోయి ఫోన్లలో అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల వ్యక్తిగత సమాచారం చోరీకి గురై తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టివిఆర్. సూరి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

### తిరుమలాపూర్ గ్రామంలో బిజెపి, బిఆర్ఎస్ కు పలువురి గుడ్ బై



**చిట్యాల, అక్టోబర్ 07( జనం సాక్షి):**మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సహా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పలువురు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు.వారంతా బుధవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపగాని స్వామి, నాయకులు కంచర్ల శ్రీనివాస్, గోలకొండ విజేందర్, బిఆర్ఎస్ పార్టీమాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపగాని శివరాములు, బిఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు ఎలగొండ శంకర్, చెన్నమల్ల మొగిలి, బీసీ సెల్ నాయకులు ఆరెల్లి సంతోష్, అనుముల రవి, గజ్జి నరేష్, తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులకు స్వాగతం పలుకుతూ సాదరంగా ఆహ్వానించారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి, పటిష్టంగా పునాదులు వేయాలన్నారు. కష్టపడే వారికి కాంగ్రెస్ పార్టీ లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్,మాజీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి ,గ్రామ కమిటీ అధ్యక్షుడు గజ్జి రవి, సర్పంచ్ జన్నె సురేష్, వార్డు సభ్యుడు కంచ బిక్షపతి, యూత్ అధ్యక్షుడు కంచర్ల రాంబాబు, మురహరి బాను చందర్, చెన్న నిశాంత్, బాలుగ నీలేష్, గోపగాని వెంకటేశ్వర్లు, గోపగాని శివ, నీరటి నారాయణ, నాగరెడ్డి శంకర్, గోనె కొమురయ్య, గోలకొండ పైడయ్య, నాయకులు, కోర్రి అశోక్, అంగడి రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లె యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఆత్మీయ ఆహ్వానం



**గీసుకొండ మండలం, అక్టోబర్ 7, (జనం సాక్షి).**గొల్లపల్లె: గొల్లపల్లె యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గామాత ఆగమన్ కార్యక్రమానికి రాపురం సర్పంచ్ రడం భరత్కు ఆహ్వానించారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి ఆయన హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు.

# నెన్నెలలో హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసిన సర్పంచ్ ఎండి ఇబ్రహీం





**నెన్నెల, అక్టోబర్ 7 (జనం సాక్షి)** నెన్నెల గ్రామంలో ప్రజల సౌకర్యార్థం నూతనంగా హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఎండి ఇబ్రహీం తెలిపారు. గ్రామంలోని పలు వాడలతో పాటు ప్రధాన చౌరస్తాల్లో హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో వెలుగులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్



**చెన్నారావుపేట, అక్టోబర్ 7( జనం సాక్షి):**చిన్నారి మౌనశ్రీని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆశీర్వదించారు. ఖాదర్ పేట గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కూస కర్ణాకర్ రమ్య దంపతుల కుమార్తె మౌనశ్రీ జన్మ దిన వేడుకల్లో పాల్గొని ఆశీర్వాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి, సర్పంచ్ గూడ సంధ్య మహేందర్, సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, ఉప సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు బండి హరీష్, ఉప్పుల దేవేందర్, సొసైటీ డైరెక్టర్ పెంతల రమరాజు, పెండ్లి ఐలయ్య, వార్డ్ సభ్యులు పెండ్లి మల్లయ్య, పెండ్లి రాజేందర్, కూస రాజశేఖర్, గూడ రమణారెడ్డి, రవి, చెంచు నాగరాజు, చెవ్వ యాదగిరి, మేడిద అశోక్, అనుముల సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన

## కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు



**టేకుమట్ల అక్టోబర్ 07 జనంసాక్షి ::** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బోర్నపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ద్యాగరి మల్లేష్ తల్లి ద్యాగరి కొమురమ్మ ఈరోజు ఉదయం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ వారి నివాసానికి వెళ్లి మృతురాలు పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించారు అనంతరం వారు మాట్లాడుతూ మృతురాలు కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడవద్దని భరోసా కల్పించారు మృతురాలు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని అండగా వారు తెలియజేశారు అనంతరం స్థానిక సర్పంచ్ నేరెళ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దాసరపు సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ కోశాధికారి శాస్త్రాల కిరణ్, మండల నాయకులు బంద రగోత్తం రెడ్డి, ఆందె కుమార్, గడ్డం నరసయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఇందిరమ్మా.. బిల్లులు లేవమ్మా!

- నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు అందని వైనం
- ఇబ్బంది పడుతున్న ఇందిరమ్మ లబ్ధిదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు



**వెంకటాపూర్(రామప్ప ),అక్టోబర్ 07(జనం సాక్షి ):-** పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందక అందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మొదటి విడతలో లబ్ధిదారుల ఎంపికలో పైరవీలకు తావులేకుండా నిరుపేదలకు సొంతింటిని నిర్మించి ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఇందిరమ్మ కమిటీలను సైతం నియమించింది. దీంతో వెంకటాపూర్ మండలంలోని కొంతమంది లబ్ధిదారులు అప్పులు చేసి మరీ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ప్రభుత్వం దశల వారీగా చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపులో నెలల తరబడి జాప్యం కావడంతో పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టి నెలలు గడుస్తున్న లబ్ధిదారులకు నేటికి బిల్లులు అందకపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారు. వెంకటాపూర్ మండల వ్యాప్తంగా మొదటి విడతలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లలో కొన్ని బేస్ మెంట్ దశలోనే ఉండగా, గోడల దశలో కొన్ని, స్లాబ్ దశలో మరికొన్ని ఇళ్లు ఉన్నాయి. కాగా, మొత్తం పూర్తయిన ఇళ్లకు సైతం నెలలు గడుస్తున్నప్పటికి బిల్లులు రాకపోవటంతో లబ్ధిదారులు ఆవేదన చేస్తున్నారు. ప్రభుత్వం దశల వారీగా రూ.5 లక్షల నిధులు చెల్లిస్తున్నప్పటికీ ,ప్రస్తుత మార్కెట్లో ఇసుక, సిమెంటు,ఇటుక, కిటికీలు, డోర్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, కూలీల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఒక్క ఇంటికి చొప్పున రూ.9 నుంచి 10 లక్షల వరకు ఖర్చు అవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.ప్రభుత్వ సహాయం సరిపోకపోవటంతో పాటు బిల్లులు సైతం సకాలంలో అందకపోవడంతో పేద ప్రజలకు ఈ పథకం భారంగా మారింది. ఇదంతా అధికారుల కళ్ళముందు జరుగుతున్నప్పటికీ వారు మాత్రం చోద్యం చూస్తుండడం ని దూరంగా మారింది.బిల్లుల చెల్లింపులో జాప్యంపై సంబంధిత హౌసింగ్ అధికారులు స్పందించి, వెంకటాపూర్ మండలంలో పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని మండలంలోని పలువురు లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

## వెలిశాల అంగన్వాడి సెంటర్లో పోషణ మాసం కార్యక్రమం



**టేకుమట్ల అక్టోబర్ 07 జనంసాక్షి** టేకుమట్ల మండలంలోని వెలిశాల సెక్టార్లోని వెలిశాల అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాధవి మేడం ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం నిర్వహించడం జరిగింది ఈ సంవత్సరము థీమ్ వచ్చేసి 'మన అంగన్వాడి మన బాధ్యత'గర్భిణీ దశ నుండే పోషకాహారము తీసుకోవడం వల్ల కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా జన్మనిస్తుంది అలాగే మన పరిసరాల్లో దొరికే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు చిరుధాన్యాలు, అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే ఒక పూట భోజనం అనగా ఆకుకూరతో పప్పు, ఎగ్ ,పాలు, తీసుకోవడం వల్ల మీ పుట్టబోయే బిడ్డ మూడున్నర కేజీలు ఉంటుంది మధ్యాహ్నం విశ్రాంతి కూడా తీసుకోగలరు ప్రతి నెల అంగన్వాడి కేంద్రంలో మీ పిల్లల బరువులు వయసు తగ్గ బరువు ఉంటున్నారు. బరువులు తీసుకోగలరు తల్లులకు అవగాహన కల్పించనైనది సర్పంచ్ బొడ్డు తిరుపతి మాట్లాడుతూ సీజన్లో దొరికే పండ్లు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోగలరని తల్లులకు వివరించారు. ఉప సర్పంచ్ ఎండి అఫ్జల్ మాట్లాడుతూ జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోకుండా మన పెరట్లో పెంచుకునే ఆకుకూరలు ,కూరగాయలు, పండ్లు ఇంట్లో తయారు చేసుకుని పిల్లలకు తల్లులు తీసుకోవాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం గిరిబాబు ఏఎన్ఎం గారు అంగన్వాడి టీచర్ ఉమాదేవి ,సునీత ,స్వప్న ఆశ వర్కర్స్ ఆయా లక్ష్మి, రూపవతి విద్యార్థుల తల్లిదండ్రులు గర్భిణీలు, స్త్రీలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు

# దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

### మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్



**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 07 ( జనం సాక్షి) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో రావణాసుర దహన కార్యక్రమం నిర్వ హించడం కోసం మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ బుధవారం భూమి పూజ నిర్వ హించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీగా అయిన తర్వాత మొదటి సారి నిర్వహిస్తున్న దసరావేడుకలను ప్రజలందరి సహ కారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, ఎస్ఐ పిట్ల రాజేష్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ మాసం
# పోషకాహారంపై 12 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం





**మహాదేవపూర్: అక్టోబర్ 7 (జనంసాక్షి):** పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం మహాదేవపూర్ పరిధిలోని పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ రైతు వేదికలో ప్రాజెక్టు స్థాయి కార్యక్రమాన్ని సిడిపిఒ అర్ రాధికరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రైతువేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, వ్యవసాయ కమిటీ చైర్మన్ తిరుమల, సర్పంచ్,హాశీనాబాను. పియసియస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయచైర్మన్ కోట రాజబాబు. సింగల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ. పోషకాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల వినియోగం, పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు సమతుల్య ఆహారం తీసుకోవాలని కార్యక్రమంలో భాగంగా పోషణ మేళా నిర్వహించి వివిధ రకాల పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం 12 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పోషణ ప్రతిజ్ఞ చేయించి, పోషణ ఛాంపియన్లకు మోమెంటోలు అందజేశారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్,పలిమెల మండల స్థాయి అధికారులు అంగన్వాడీ సూపర్వైజర్లు టీచర్లు చిన్నారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఓటర్ల ఇంటికి ఇక బీఎల్వోలు

### 465 నోటీసులు పెండింగ్



**పాలకుర్తి, అక్టోబరు 07(జనంసాక్షి)** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) లో భాగంగా నోటీసులు అందుకున్న వారు ఇక తహసీల్దార్ కార్యాలయం, అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. బీఎల్వోలే వారి వద్దకు వచ్చి అవసరమైన పత్రాలను తీసుకుంటారు. ఈ మేరకు ఎన్నికల సంఘం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. బీఎల్వోలు వచ్చి పత్రాలు తీసుకొని ఈసీఐ, నెట్లో అప్లోడ్ చేస్తారు. వీటిని ఈఆర్వో, ఏఈఆర్వోలు పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటారు. అవసరమైతే ఆన్లైన్లో విచారణ చేపట్టనున్నారు. నోటీసులో పేర్కొన్న ఓటర్లే కాకుండా ఆ కుటుంబాల్లో పెద్దవారు ఎవరైనా ఈ విచారణకు హాజరుకావచ్చని ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది. దీంతో నోటీసులు విచారణకు ప్రక్రియ వేగవంతం ముగియనుందని అధికారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం వచ్చిన నోటీసులు జారీ చేయగా, 69,954, వాటిలో 69,489 మందికి నోటీసులు తీసుకున్నారు. ధృవీకరణ పత్రాలతో హాజరైనవారు 59,234 మంది. ఇంకా 10,720 మంది వారి ధృవీకరణ పత్రాలతో విచారణకు హాజరుకావల్సి ఉంది. ఇంకా నోటీసులకు స్పందించని వారు పెండింగ్లో ఉన్నవి 465, అయితే ఈ విచారణకు హాజరు కాని వారి ఇళ్ల వద్దకు బీఎల్వోలు వెళ్లి విచారణ చేపట్టి ధృవపత్రాలను అప్లోడ్ చేయాలని ఎన్నికల సంఘం తాజాగా ఆదేశించడంతో అనామలిస్ గా గుర్తించిన వారికి వెసులబాటు కలిగింది. నోటీసులకు స్పందించని వారు 465 మంది పాలకుర్తి నియోజకవర్గంలో మొత్తం 2,55,514 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 129,090, పురుషులు 126,411 మంది ఓటర్లు ఉన్నారు. నియోజక వర్గంలో మొత్తం 298 బీఎల్ వోలు ఉండగా, అనామలిస్, మ్యాపింగ్ కాని వారిని గుర్తించి నోటీసులు జారీ చేశారు.

# ఎస్ఆర్ శంకరన్కు ఘన నివాళులు

### ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న



**గూడూరు, అక్టోబర్07 (జనంసాక్షి):** గిరిజన దళిత అభ్యున్నతి వర్గాల కోసం మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన వ్యక్తి ఎస్ ఆర్ శంకరన్ అని కొనియాడారు. బుధవారం గూడూరు మండలం మచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని జిపిఎస్ బేతంచెర్ల పాఠశాలలో ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ తమిళనాడు రాష్ట్రంలోని తంజావూర్ జిల్లా సరిగుత్తూరులో 1934 అక్టోబర్ లో జన్మించారని,అక్టోబర్ 2010లో మరణించారని తెలిపారు.ఎస్ఆర్ శంకరన్ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మహనీయుడని, కష్టపడి చదివేవారని, శంకరన్ ప్రజలకు సేవ చేయాలనే తపన పట్టుదలతో 1957 వ సంవత్సరంలో ఐఏఎస్ కు ఎంపికయ్యారని అన్నారు.ప్రజాసేవలో అంచలంచెలుగా ఎదిగి ప్రజల మన్ననలతో పాటు ప్రభుత్వ ప్రధాన అధికారులు మంత్రుల ప్రశంసలు అందుకున్నారని కొనియాడారు.శంకరన్ నెల్లూరు జిల్లాలో కొంతకాలంగా కలెక్టర్ గా పనిచేసిన శంకరన్ సంచలనాత్మక వ్యక్తి ఆయన గిరిజన దళిత వర్గాల అభ్యున్నతికి కోసం మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన కార్యశీలి, బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేసిన వ్యక్తి అని విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రేగ సాంబయ్య, విద్యార్థినీ, విద్యార్థులు, పాల్గొన్నారు.

# నెట్‌వర్క్ మెడిసిన్, కృత్రిమ మేధస్సు, ప్రెసిషన్ థెరప్యూటిక్స్‌పై అంతర్జాతీయ సదస్సు



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 07 (జనం సాక్షి)**ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పి సి ఐ) సౌజన్యంతో నిర్వహించిన నేషనల్ ఫార్మసీ వీక్--2026 వేడుకల్లో భాగంగా ఆధునిక ఫార్మకాలజీ రంగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక పరిణామాలు, కృత్రిమ మేధస్సు నెట్‌వర్క్ మెడిసిన్, ఫార్మకోజెనోమిక్స్, ప్రెసిషన్ థెరప్యూటిక్స్ అంశాలపై అవగాహన కల్పించే రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు వరంగల్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల (అటానమస్), బొల్లికుంటలో విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సును ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ సదరన్ రీజియన్ ఎ పి టి ఐ వైస్ ప్రెసిడెంట్ డా. ఎం. వెంకటరమణ, అమెరికాలోని పసిఫిక్ విశ్వవిద్యాలయం థామస్ జె. లాంగ్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ డి. ఆర్. కృష్ణ, కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ సీనియర్ ప్రొఫెసర్ వై. నరసింహారెడ్డి, దుబాయ్ ఫార్మసీ కాలేజ్ ఫర్ గర్ల్స్ లో క్లినికల్ అఫైర్స్ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న మీర్జా బేగ్, తాళ్ల పద్మావతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. వెంకటేశ్వర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. కళాశాల ఐ క్యు ఏసి, ఐఐసీఆధ్వర్యంలో, ఏ పి టి ఐ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ మరియు ఐపీఏ వరంగల్ సిటీ లోకల్ బ్రాంచ్ సహకారంతో జరిగిన ఈ సదస్సులో డా. వెంకటరమణ మాట్లాడుతూ, సంప్రదాయ ఔషధ లక్ష్యాల ఆధారిత విధానాల నుంచి నెట్‌వర్క్ ఆధారిత ఔషధ పరిశోధన వైపు ఫార్మకాలజీ రంగం వేగంగా మారుతోందని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ డి. ఆర్. కృష్ణ మాట్లాడుతూ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, కంప్యూటేషనల్ మోడల్లింగ్, ఫార్మాకో జినో మిక్స్, ప్రెసిషన్ మెడిసిన్ వంటి ఆధునిక సాంకేతికతలు కొత్త ఔషధాల ఆవిష్కరణ, వ్యాధి నిర్ధారణ, వ్యక్తిగతీకరించిన చికిత్సా విధానాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. అనంతరం వై. నరసింహారెడ్డి మాట్లాడుతూ క్లినికల్ రీసెర్చ్, ఔషధ అభివృద్ధి, ట్రాన్స్‌లేషనల్ సైన్స్, నెట్‌వర్క్ ఫార్మకాలజీ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు.అనంతరం ప్రొఫెసర్ జె. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ఆధునిక ఫార్మకాలజీ రంగంలో పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశోధన వైపు ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ప్రొఫెసర్ డా. జి. కమల్ యాదవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఫార్మసీ విద్యార్థులు, పరిశోధకులకు ఆధునిక ఫార్మకాలజీపై నూతన అవగాహనతో పాటు పరిశోధన, పరిశ్రమ, క్లినికల్ రంగాల మధ్య సమన్వయంపై విలువైన పరిజ్ఞానం లభించిందని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు, ఫార్మసీ విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు సదస్సులో పాల్గొని తమ పరిశోధనా అనుభవాలను పంచుకున్నారు.సదస్సులో భాగంగా యువ పరిశోధకులను ప్రోత్సహించడానికి ఓరల్ మరియు పోస్టర్ ప్రజెంటేషన్లు నిర్వహించారు . ఈ సదస్సులో వక్తలుగా నిపుణులు డా. ఇరవై భట్నాఘర్, డా. హరీష్ కౌశిక్ కోటకొండ, డా. బోయిని కృష్ణ, ప్రొఫెసర్ ప్రభాకర్ రెడ్డి, ప్రొఫెసర్ చిన్నల కృష్ణ మోహన్ ,కో-కన్వీనర్ డా. కే. శిరీష , ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ఫర్మిజా బేగం, ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్లు డా. ఆర్. శివకుమార్, డా. టి. రవిచందర్ తో పాటు ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌కు దాతృత్వ ప్రోత్సాహం

## కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బ్యాగుల పంపిణీ



**దేవరుప్పుల, అక్టోబర్ 07 (జనం సాక్షి):**అప్పిరెడ్డిపల్లి లోమండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.20 వేల విలువైన స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జీ.శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ దేవరుప్పుల సహకారంతో ఐ.వా. రెడ్డి రైస్ మిల్ యజమాని, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు దుగ్గింపూడి కిరణ్ కుమార్ రెడ్డి బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడగాని అనూష నరసింగరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోలి చిన్న ఉప్పల్ రెడ్డి, కార్యదర్శి బూతూరి అశోక్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ మద్రి పట్టాభిరాం రెడ్డి, ట్రెజరర్ ఈదునూరి రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, తిరుపతి రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**వెంకటాపూర్ (రామప్ప ), అక్టోబర్ 07(జనం సాక్షి ):**-వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల పరిస్థితులు, స్థితిగతులతోపాటు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల తరగతి గదులను సందర్శించిన పీఓ విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల విద్యా బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని భూపాలపల్లిలో సేవా జ్యోతి యాత్ర



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో,(జనంసాక్షి):**ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా భూపాలపల్లిలో సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్ చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొన్నారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రధాని మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుండి పోచమ్మ గుడి వరకు సేవా జ్యోతి యాత్ర నిర్వహించి, తిరిగి అంబేద్కర్ సర్కిల్ వద్ద వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ దేశానికి గర్వకారణమని, పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తోందని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ సేవా భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జి అరుట్ల దశమంతరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి పాపన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, జన్నె మొగిలి, ఎరుకల గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెండ్యాల రాజు, తాటికొండ రవికిరణ్, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

## చందుపట్ల కీర్తిరెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి ఇన్ చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, జిల్లా ఇన్ చార్జి పిడుగు కృష్ణ సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మరోసారి అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామనడం విడ్డూరమన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మీరు కూడా బీసీ నాయకులే కదా.. చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడే బీసీ నాయకుడిని సీఎం చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. బీసీలను అడ్డుపెట్టుకుని మోసపూరిత హామీలు మానుకోవాలని, ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతే బీసీల గురించి మాట్లాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్ చార్జి అరుట్ల దశమంత రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# హనుమకొండలో “వికసిత్ భారత్ సంకల్ప సభ”

## అంబేద్కర్ జంక్షన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు సేవా జ్యోతి యాత్ర

**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 7 (జనం సాక్షి)** :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని, హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద “వికసిత్ భారత్ సంకల్ప సభ” ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రత్యక్ష ప్రసంగాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు “సేవా జ్యోతి యాత్ర” నిర్వహించారు. దేశ సేవకు, ప్రజాసేవకు అంకితమైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్ రావు మరియు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హనుమకొండ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూనరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అభివృద్ధి, సంక్షేమం మరియు సుపరిపాలనకు కొత్త దిశ ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావు పద్మ ,డా. కాళీ ప్రసాద్, చాడ స్వాతి , మాజీ మేయర్ డా. రాజేశ్వర్ రావు , రాష్ట్ర నాయకులు రావుల కిషన్ , చాడ శ్రీనివాస్ రెడ్డి , దొంతి దేవేందర్ రెడ్డి డా. సిరంగి సంతోష్ , మాజీ కార్పొరేటర్లు గుజ్జుల వసంత , రావుల కోమల అభినవ్ భాస్కర్ , జిల్లా ప్రధాన కార్యదర్శులు జయంత్ లాల్ , సంద్ర మధు , మేఘునాథ్ , బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పున్నం వేణు , మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్నలక్ష్మి , వివిధ డివిజన్ మరియు మండల అధ్యక్షులు, బీజేవైఎం నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కుష్టు వ్యాధి నిర్మూలనకు శిక్షణా కార్యక్రమం



**మహబూబాబాద్, అక్టోబర్ 07(జనం సాక్షి):** జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం కేంద్ర పరిశీలకులు డాక్టర్ భాగ్యజ్యోతి, తెలంగాణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు , తెలంగాణ రాష్ట్ర లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ రాజు మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సమీక్షా సమావేశం మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అనిత మరియు సిబ్బందితో జిల్లాలో కుష్టు వ్యాధి గుర్తింపు, చికిత్స, నివారణ మరియు నిర్మూలన కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు ఆర్బిఎస్కే వైద్యాధికారులు మరియు వారి సిబ్బందికి కుష్టు వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం, చర్మంపై కనిపించే అనుమానిత మచ్చలను పరిశీలించడం, అనుమానిత కేసులను గుర్తించి వైద్య పరీక్షలకు పంపించడం మరియు అవసరమైన చికిత్స అందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా 5--18 సంవత్సరాల వయస్సు గల పాఠశాల విద్యార్థుల్లో కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించాలని ఆర్బీస్కె సిబ్బందికి సూచించారు. అవసరమైన సందర్భాల్లో పిల్లల కుటుంబ సభ్యులను కూడా పరీక్షించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి తగిన చికిత్స అందించాలని తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి పూర్తి స్థాయిలో చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని డాక్టర్ జాన్ బాబు మరియు డాక్టర్ భాగ్యజ్యోతి తెలిపారు. జిల్లాలో కుష్టు వ్యాధి కేసులను సమర్థవంతంగా గుర్తించి, చికిత్స అందిస్తూ మహబూబాబాద్ జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా కొనసాగించేందుకు అన్ని స్థాయిల ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన పెంచడంతో పాటు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి అవసరమైన వైద్య మరియు ఆరోగ్య సేవలు అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ శిక్షణలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆర్.బి.ఎస్.కె వైద్యాధికారులు, పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల నిర్వహణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ఏటూరునాగారం,అక్టోబర్ 07(జనంసాక్షి).** మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో ఈ నెల 20వ తేదీన జరగబోయే విజయదశమి (దసరా) ఉత్సవాల నిర్వహణ మరియు కార్యక్రమాల రూపకల్పనపై గ్రామ పెద్దల సమక్షంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దసరా ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు గాను నూతన ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ఇర్సవడ్ల వెంకన్న, అధ్యక్షులు తుమ్మ మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు వావిలాల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి తాడూరి రఘు, కోశాధికారి నూక ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని గ్రామ పెద్దలు, వివిధ దేవాలయాల చైర్మన్లు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులనుకు రాబోయే దసరా ఉత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలందరూ తమ వంతు సహకారాన్ని అందించాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గ్రామ పెద్దలు కోరారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుంది

- పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం
- అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం
- గుడిసెలలో నివాసముంటున్న 168 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ కాపీలను అందజేసిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల,అక్టోబర్07,(జనంసాక్షి):** పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్, పరకాల, నడికూడా, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన గుడిసెలలో నివాసముంటున్న 168 మంది నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాలను బుధవారం రోజున పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఆత్మకూరు మండలానికి 81, దామెర 17, నడికూడ 18, పరకాల మండలం 38, పరకాల టౌన్ 14 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు. గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చేదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రధాన లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పార్టీలకు అతీతంగ ఇండ్లను ఇస్తున్నామని అన్నారు. పారదర్శకంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ప్రలోభాలకు, పైరవీలకి తావు ఉండదు అని అన్నారు .ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని



అన్నారు. గత బిఆర్ఎస్ నాయకులు ఇండ్లు ఇస్తానని మోసం చేశారని,గత ప్రభుత్వ పాలకుల నిర్వాకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, ప్రజాధనాన్ని పందికొక్కులాల దోచుకున్నారని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలని ఉద్దేశంతో ఏజెన్సీల ద్వారా పేద ప్రజలకు ఇండ్లను కట్టిస్తున్నామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను అందుకున్న లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు పొలంలో 9 అడుగుల కొండచిలువ



**నల్లబెల్లి, అక్టోబర్ 07 (జనం సాక్షి) :** మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ భూమిలో సుమారు తొమ్మిది అడుగుల పొడవున్న భారీ కొండచిలువ బుధవారం కనిపించింది. దానిని చూసిన రైతులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పెద్ది కృష్ణారెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో కొండచిలువను గుర్తించిన స్థానికుడు పిట్టల రమేష్ చాకచక్యంగా దానిని బంధించాడు. అనంతరం కొండచిలువను నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి ఎస్సై సాయిప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారి కిరణ్‌కు అప్పగించారు. అటవీశాఖ సిబ్బంది కొండచిలువను సురక్షితంగా తరలించారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువను చాకచక్యంగా బంధించి అటవీశాఖ అధికారులకు అప్పగించిన పిట్టల రమేష్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కిరణ్, నాగరాజు, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్



**మహబూబాబాద్, అక్టోబర్ 07(జనం సాక్షి):** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని 4వ వార్డు గాంధీపురంలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి రమేష్ నాయక్‌లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రంలో గర్భిణీతో ఉన్న మహిళలకు చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా, దృఢంగా ఉండవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సేవలను అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్ కే జి, యూ కే జి స్థాయిలోనే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఫీజులు చెల్లిస్తూ తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి, అక్కడి ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అఖిల , సూపర్వైజర్ భవాని, నజ్మ, స్వప్న సుజాత శివకుమారి, వివిధ వార్డుల అంగన్వాడీ టీచర్స్ మరియు సంబంధిత అంగన్వాడీ ఆయాలు కలిసి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో నిరుద్యోగులపై ప్రత్యేక సర్వే

- మీరు నిరుద్యోగులా..? అయితే వివరాలు తెల్పండి!
- ఈజీఎంఎం ద్వారా ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సర్వే
- 18 నుంచి 35 సం.రాలు గల నిరుద్యోగుల వివరాలు సేకరణ
- తప్పకుండా మీ గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోండి




**ములుగు,అక్టోబర్7(జనం సాక్షి):-** గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల నిరుద్యోగ యువత వివ రాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ జిల్లా అధికారులకు ఆదివారం ఆదేశాలు జారీ చేసింది.ములుగు జిల్లా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల ద్వారా నిరుద్యోగుల సమగ్ర సమాచారం తీసుకొని ఆన్లైన్లో నమోదు చేయించాలని అధికారులు సూచించారు. రెండురోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని,నిరుద్యోగి పేరు సహా వారికి సంబంధించిన వ్యక్తిగత, విద్యార్హత వివరాలను తెలంగాణ ఇ-పంచాయత్ వెబ్సైట్లో నమోదు చేయాలని తెలిపారు.సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరించి సమర్పించాలని తెలిపారు. నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమాచారం తీసుకోవడం ఇదే తొలిసారి ఈ వివరాల ఆధారంగా వారికి ఉపాధి కల్పన, మార్కెటింగ్ పథకం(ఈజీ ఎంఎం),ఇతర పథకాల కింద శిక్షణ ఇచ్చి ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించాలని భావిస్తోంది.ఇటీవల ఈజీఎంఎం కొత్త కార్యనిర్వహణాధికారి (సీఈవో) రవీందర్ సమావేశం నిర్వహించగా పలు కార్పొరేట్ సంస్థలు కొలువులు ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిపారు.ప్రతి నిరుద్యోగి తప్పకుండా మీ యొక్క వివరాలను మీ గ్రామపంచాయతీలలో నమోదు చేసుకోవాలని జిల్లా అధికారులు తెలిపారు.

## బీజేవైఎం మండల అధ్యక్షుడుగా వినయ్ కుమార్



**పాలకుర్తి, అక్టోబరు 07(జనంసాక్షి)** భారతీయ జనతా యువ మోర్చా మండల అధ్యక్షుడుగా మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన తండ వినయ్ కుమార్ ను బుధవారం నియమిస్తూ, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంతో బీజేవైఎం మండల అధ్యక్షుడుగా నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు హరీష్, జిల్లా నాయకుడు దొంగరి మహేందర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో బీజేవైఎం ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

## ఘనంగా కేవీపీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**గోవిందరావుపేట అక్టోబర్07( జనం సాక్షి)-:** కేవీపీఎస్ 29వ ఆవిర్భావ వేడుకలు మండలంలోని పసర గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల మురళీ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే నినాదంతో పూలే అంబేడ్కర్ స్ఫూర్తిగా తీసుకొని సామాజిక సమస్యల పై ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ చట్టాన్ని కెవిపిఎస్ పోరాటం ద్వారా సాధించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఊరుకో స్మశాన వాటిక ఉండాలని పోరాటం చేసి జీవో సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఎక్కడ అన్యాయం జరిగిన, న్యాయం జరిగే వరకు కే విపి ఎస్ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల, మతాలను అడ్డుపెట్టుకొని ఓట్ల రాజకీయం చేస్తుందని అదేవిధంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పేరుతో ఈ తెలంగాణలో 13 లక్షల ఓట్లను తొలగించారూ అని మండిపడ్డారు. భారత రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కు పొందిన వారి పేర్లు తీసివేయడానికి వీలులేదని తెలిపారు ,జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే తొలగించాలని, లేదంటే భవిష్యత్తులో ఉద్యమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, జిల్లా నాయకులు చంటి, మండల కమిటీ సభ్యులు జెమిని, కిరణ్, గాజుల బిక్షం, నరేష్, రఘు, పులి, శారద, సాంబయ్య, మమత, అరుణ, జి.ఐలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అసిస్టెంట్ కమాండెంట్గా శ్రీ ఆర్. అరుణ్ రాజ్కుమార్ బాధ్యతల స్వీకరణ



**గోవిందరావుపేట అక్టోబర్07( జనం సాక్షి)** :చల్వాయి 5వ బెటాలియన్ టీజీఎస్పీకి నూతన అసిస్టెంట్ కమాండెంట్గా ఆర్. అరుణ్ రాజ్కుమార్. నియమితులై బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన అలైడ్ ఫోర్స్లో విధులు నిర్వహిస్తూ తన సేవలను అందించారు. ప్రస్తుతం నూతన పోస్టింగ్పై 5వ బెటాలియన్ టీజీఎస్పీలో అసిస్టెంట్ కమాండెంట్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ సి.వి. లక్ష్మీకాంత్ రావు. నూతన అసిస్టెంట్ కమాండెంట్కు శుభాకాంక్షలు తెలిపారు. బెటాలియన్ విధుల నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తూ, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆర్. అరుణ్ రాజ్కుమార్. బెటాలియన్ అధికారులు మరియు సిబ్బందితో పరిచయం చేసుకుని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అందరి సహకారం కోరారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, ఆర్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక సేవలో పట్టువదలని విక్రమార్కుడు

**పులి దేవేందర్ ముదిరాజ్కు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి**

**అందరి మద్దతు ఉందంటున్న ముదిరాజ్, బిసి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు**

**బర్ల కాపరి నుంచి బడి పంతులుగా నేడు ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి ప్రజాప్రతినిధిగా**







**చెన్నారావుపేట, అక్టోబర్ 7 ( జనం సాక్షి):** నాడు చిన్నతనంలో బడికి వెళ్లలేక బర్రెలను మేపిన బాలుడు....కళాకారుడిగా సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించిన యువకుడు.. పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించిన విద్యావంతుడు.... సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయం చూడలేక జాతి అభ్యున్నతి లక్ష్యంగా మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ ) స్థాపించిన సామాజిక విశ్లేషకుడు.. ఆయనే మన పులి దేవేందర్ ముదిరాజ్... ఇలాంటి సేవా గుణం ఉన్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిని చట్టసభల్లోకి పంపితే చాలా మందికి ఆయన సేవ చేసే అవకాశం ఉంటుందని సహచర మిత్రులు, కుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు అభిప్రాయ పడుతున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన పులి దేవేందర్ ముదిరాజ్...చిన్న నాటి నుంచి సామాజిక అవగాహన కలిగి పెరిగాడు.తాను తన కుటుంబం పడుతున్న ఇబ్బందులు తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను చూడలేక తండ్రి మేపుతున్న బర్లతో తండ్రితో పాటు తాను వెళ్లి బర్లను కాసేవాడు.గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తనను గుర్తించిన ఓ ఉపాధ్యాయుడు ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే గురుకులాల ప్రవేశ పరీక్షను రాపించడంతో అప్పుడు దేవేందర్ అర్హత సాధించి బండారుపల్లిలోని గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించాడు. అనంతరం అక్కడి గురువుల పోద్బలం, ప్రోత్సాహంతో ఉపాధ్యాయ వృత్తిని సులభంగా అందిపుచ్చుకునే టిటిసి పూర్తి చేశాడు. అతి చిన్న వయసులోనే కష్టపడి చదివి 2010లో ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని మారుమూల తండాలో ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన పులి దేవేందర్ ముదిరాజ్ అక్కడి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషించారు. తన శిష్యరికంలో అనేక మంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉండడం ఆయన నిబద్ధత ఉద్యోగంపై ఉన్న ఆసక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు. యుక్త వయసులో తాను స్టేజ్ కళాకారుడిగా అనేక నాటకాలు వేసి ప్రజల్లో సామాజిక రుగ్మతలపై అవగాహన కలిగించాడు. ప్రధానంగా నాటి రోజుల్లో ప్రబలిన సారా నిర్మూలన తదితర అంశాలపై నాటక రూపంలో ప్రజలను చైతన్యం చేయడంలో పులి దేవేందర్ ముదిరాజ్ ముఖ్య పాత్ర పోషించాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ప్రారంభం**

పులి దేవేందర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎదుగుతూ తన సామాజిక వర్గంలో వెనుకబడిన కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని ఎదిగించాలనే ఉద్దేశంతో అనేకమంది సామాజిక విద్యావేత్తలతో చర్చించిన అనంతరం మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ )ను పార్టీలకతీతంగా ప్రారంభించారు. సుమారు 8 ఏళ్లుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ముదిరాజ్ జాతి అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ప్రధానంగా నిరుద్యోగులకు పుస్తకాల పంపిణీ, స్టడీ మెటీరియల్ తో పాటు సమ్మర్ కోచింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతలో కూడా పులి దేవేందర్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో అందించిన మెటీరియల్తో ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడిన పలువురు అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గమనార్హం. నిరుద్యోగులకు అండగా నిలవడంతో పాటు పేద, ధనిక అనే తేడా లేకుండా ఎవరికి ఎక్కడా ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకెళ్తూ మెపా ఆధ్వర్యంలో అనేక సహకార కార్యక్రమాలను కూడా చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించేందుకు గాని అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ఆర్థిక సాయం అందించేందుకు కానీ వెనకాడకుండా ముందుకు వెళ్తున్నారు పులి దేవేందర్ ముదిరాజ్. ఇందులో భాగంగా ఓ జర్నలిస్టుకు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా సుమారు రూ. 1లక్షకు పైగా అందించి అంటే ఎవరికి ఎక్కడ ఏ ఆపద వచ్చినా ముందుంటుంది అని నిరూపించారు.

**పుట్టిన ఊరు ఉప్పరపల్లిలో అనేక సేవా కార్యక్రమాలు**

తన పుట్టిన ఊరు ఉప్పరపల్లిలో సేవ చేయాలనే ఉద్దేశంతో గ్రామ పెద్దలు, పిల్లలు, యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగులు అందరినీ కలిపి ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ ముందుకెళ్లేందుకు ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత మన పులి దేవేందర్ ముదిరాజ్ దే. గ్రామంలో ఎవరు మృతి చెందిన లేదా ఎవరు ఇబ్బందిపడిన గ్రామ నిరుద్యోగ, ఉద్యోగ, వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో సహకారం అందిస్తున్నారు. తెలంగాణలో ఉన్న గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలో కీలకంగా పనిచేస్తున్న అనేక మందితో సంబంధాలు కొనసాగిస్తూ తమ ముదిరాజ్ జాతి బిడ్డలకు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నారు పులి దేవేందర్ ముదిరాజ్. కేవలం ముదిరాజ్ సామాజిక వర్గంలోని ప్రజలకే కాకుండా నిత్యం ఎక్కడ ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకెళ్తూ సామాజిక చైతన్య కార్యక్రమాలతో పాటు సామాజిక అవగాహన కార్యక్రమాలను సైతం చేపడుతున్నారు దేవేందర్ ముదిరాజ్. ఇందులో భాగంగా స్థాపించింది బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్. బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ద్వారా ఆ సంఘంలోని సభ్యులతో పాటు ఎవరికి ఏ ఆపద వచ్చిన ఆర్థిక సాయం అందిస్తూ ముందుకు వెళ్తున్నారు ఆయన.పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు ప్రతి ఏడాది స్నేహితుల దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య సేవా కార్యక్రమాలు చేసిన అనేకమందికి అవార్డులను ప్రధానం చేస్తూ వారిని మరింత సామాజిక సేవకు ప్రోత్సహిస్తున్నారు.

**ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం**

ఉపాధ్యాయుడిగా నిత్యం విద్యార్థులతో మెదలడంతో పాటు ఆయా విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసేందుకు పీఆర్టియూ తెలంగాణ సంఘంలో కూడా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవేందర్ బాధ్యతలను చేపట్టి వారి హక్కులు సాధించడం కోసం రాష్ట్రస్థాయిలో పోరాటం చేస్తున్నారు. ప్రధానంగా పాత పెన్షన్ విధానం అమలు కోసం చేపట్టిన అనేక ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ముందు నిలిచి ఉపాధ్యాయులకు భరోసా కల్పించారు. ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు నిరంతరం ప్రజలు సామాజిక వర్గాలు కుల మతాలు అనే తేడా లేకుండా అందరికి అందుబాటులో ఉంటున్న దేవేందర్ రాజకీయాల్లో సైతం రాణించాలని పలువురు మిత్రులు, కుల సంఘాల పెద్దలు, సహచర ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి పదవి లేకుండానే ఇన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్న దేవేందర్ రాజకీయంగా కూడా ఎదిగితే.. ఒక మంచి స్థానంలో మంచి పదవిలో ఉంటే అన్ని వర్గాలకు మంచి జరుగుతుందని.. ఎలాంటి అవంతరాలు లేని సమాజం ఏర్పడుతుందని పులి దేవేందర్ ముదిరాజ్ కు మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఈటల రాజేందర్ ముదిరాజ్, బండా ప్రకాష్ ముదిరాజ్, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నీలం మధు ముదిరాజ్ ల మద్దతు మెండుగా ఉందని పలువురు సామాజికవేత్తలు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రానున్న నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ లేదా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోటీ చేసి విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన పులి దేవేందర్ చట్టసభల్లో ఉంటే వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని.. ఇలాంటి విద్యావంతులు సామాజిక అవగాహన కలిగిన వారు రాజకీయాలలోకి రావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఆల్ ద బెస్ట్ దేవేందర్.

# మహబూబాబాద్ జిల్లాస్థాయి పద్మశాలి ప్రతిభా పురస్కారం 2026




**తొర్రూరు , అక్టోబర్ 07 (జనం సాక్షి):** తొర్రూరు మండల పోపా ఆధ్వర్యంలో మానుకోట జిల్లా స్థాయిలో 18 మండలాల పద్మశాలి విద్యార్థిని, విద్యార్థులకు 2026లో పీజీ మెడిసిన్ , ఎంబిబిఎస్, బిఎఎం, బి హెచ్ ఎం ఎస్, బీడీఎస్, ఐఐటి, త్రిబుల్ ఐటీ లలో అడ్మిషన్ సాధించిన వారికి , ఇంటర్ , 10 వ తరగతి లో ఉత్తమ గ్రేడులు సాధించిన ప్రతిభావంతులైన పద్మశాలి విద్యార్థిని విద్యార్థులకు మరియు 2026 లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు, రాష్ట్రస్థాయి క్రీడా పథకాలు సాధించిన వారికి ,పద్మశాలి ప్రతిభ పురస్కారం 2026. కార్యక్రమం తేదీ 17 -10- 2026. శనివారం రోజున ఉదయం 10 గంటలకు నితిన్ భవన్ (వందేమాతరం ఫౌండేషన్) తోరూరు నందు నిర్వహించబడును. కావున ఇట్టి కార్యక్రమంలో జిల్లా మరియు వివిధ మండలాల్లోని పద్మశాలి సంఘ సభ్యులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కుల బాంధవులు, ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు ,మేధావులు మరియు విద్యార్థిని విద్యార్థులు ఇదే మా ఆహ్వానంగా భావించి అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరుచున్నాము. అభ్యర్థులు మార్కుల మెమో,ర్యాంక్ కార్డు, జిరాక్స్ మరియు బయోడేటా పాస్ ఫోటో సైజ్ ఫోటోను 15 -10-2026 గురువారం సాయంత్రం 5 గంటల లోపు.సెల్ 9441670810, ,9441055082, 9440672321. నెంబర్లకు వాట్సప్ ద్వారా పంపించగలరు లేదా సంధ్యా ప్రింటర్స్ తోరూర్ ,మహాలక్ష్మి క్లాత్ స్టోర్ తొర్రూర్ నందు జిరాక్స్ కాపీలు ఇవ్వగలరు. ఇట్టి సందర్భంగా తొర్రూర్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మహబూబాబాద్ జిల్లా పోపా అధ్యక్షులు బుధారపు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిభ కలిగిన పద్మశాలి విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుచున్నారు, ఈ కార్యక్రమంలో తొర్రూరు మండల పోపా బాద్యులు కొండ్ల యాకన్న, చందా రవీంద్ర కుమార్, జంజీరాల రవీందర్, వేముల జగన్ , దాసరి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లలో జాప్యం సహించేది లేదు

- రైతులకు సకాలంలో సేవలందించాలి
- ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య



**కాటారం అక్టోబర్ 7( జనం సాక్షి):** రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో అందడంలో జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య బుధవారం కాటారం డివిజన్ కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిపేరింగ్ సెంటర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల పరిస్థితిని పరిశీలించి, రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని సిబ్బందిని ప్రశ్నించారు. రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడకుండా వెంటనే మరమ్మతులు పూర్తి చేసి ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలని సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ఈ ప్రాంత రైతాంగానికి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయరాదని సిబ్బందికి స్పష్టం చేశారు. రిపేర్లలో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారం రోజుల్లో రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పిల్లమరి రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, మండల ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్‌రెడ్డి, నాయకులు ఆత్మకూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఎస్ఐ తాజుద్దీన్ కౌన్సిలింగ్

## మీ ఫోటోలే మీకు శత్రువు కావచ్చుజాగ్రత్త పసర ఎస్ ఐ ఎస్ కె తాజుద్దీన్



**గోవిందరావుపేట అక్టోబర్07 (జనం సాక్షి) :** మండలంలోని చల్వాయి మోడల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆన్లైన్ మసాలా పై అవగాహన కార్యక్రమాన్ని పసరా ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తాజ్ మాట్లాడుతూ బిడ్డల్లారా.. మీరు నా బిడ్డలతో సమానం. మీ ముందు నేను ఎస్ఐ గా కాదు.. మీ అన్నగా, మీ తండ్రిగా మాట్లాడుతున్నా.. ఒక్కసారి ఆలోచించండి.. మీ అమ్మ మిమ్మల్ని ఎంత కష్టపడి చదివిస్తోంది.. మీ నాన్న మీ భవిష్యత్తు కోసం ఎండలో ఎంత చెమటోడుస్తున్నాడు.. వారి కల ఒక్కటే.. మీరు పెద్దవాళుకావాలి.. గొప్పవాళ్లు కావాలి.. కానీ మీరు ఫోన్ లో తెలియకుండా నొక్కే ఒక్క లింక్.. మీ అమ్మ కలను, మీ నాన్న కష్టాన్ని ఒక్క క్షణంలో బూడిద చేస్తుంది బిడ్డా.. మీరు అమాయకంగా షేర్ చేసే ఒక్క ఫోటో.. రేపు మిమ్మల్ని సమాజంలో తలెత్తుకోకుండా చేస్తుంది. బిడ్డా.. ఫ్రీ రీచార్జ్ లేదు.. ఫ్రీ లాటరీ లేదు.. ఫ్రీ గా వచ్చే ప్రతిదీ మోసం అని గ్రహించండి. ఇన్ స్టా గ్రామ్ లో మీకు మెసేజ్ చేసే ప్రతి అమ్మాయి, ప్రతి అబ్బాయి నిజం కాదు.. ఆ ఫోటో వెనుక 40 ఏళ్ల మోసగాడు ఉండొచ్చు.. మీ జీవితం చాలా విలువైనది దాన్ని ఒక నకిలీ లింక్ కోసం, ఒక ఫేక్ లైక్ కోసం పోగొట్టుకోవద్దు.. మీ ఫోన్ మీ చేతిలో పుస్తకం కావాలి.. మీ భవిష్యత్తుకు వెలుగు కావాలి.. కానీ మీ జీవితాన్ని చీకటి చేసే కత్తి కాకూడదు. ఒకవేళ ఏదైనా జరిగితే.. భయపడి ఏడవకండి.. మీ అమ్మ నాన్నకు చెప్పండి.. మాకు చెప్పండి.. మేము ఉన్నాం.. మీ కోసం 1930 ఎప్పుడూ తెరిచే ఉంటుంది. మీరు బాగుండాలని కోరుకునే మీ పోలీస్ డిపార్ట్మెంట్ ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాగల్ రైతు వేదికలో రైతులకు శిక్షణ



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 07 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని చాగల్‌లోని రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి (డి ఏ ఓ) ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ అపర్ణ, ఎంఏఓ కరుణాకర్, ఏఈఓ అనిత, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ సురేష్ పాల్గొని రైతులకు వ్యవసా య సంబంధిత అంశాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు.అనంతరం కేంద్ర బృందం రైతు వేదికను సందర్శించి, రైతులు వ్యవసాయ అధికా రులతో మాట్లాడి రైతు వేదికల ద్వారా నిర్వహిస్తు న్న కార్యక్రమాలపై వివరాలు సేకరించింది. వ్యవసాయ రంగంలో రైతు వేదికలు రైతులకు శిక్షణ,సమాచారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర బృందం పేర్కొంది.

# మేడారం పర్యటనకు ఐఐఎఫ్‌ఎం భోపాల్ బృందం

## ఏర్పాట్లు చేసిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో




**ఏటూరు నాగారం అక్టోబర్ 07( జనం సాక్షి).** మేడారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, అటవీ ఆధారిత జీవనోపాధి తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ ( ఐఐఎఫ్ఎం), భోపాల్ కు చెందిన ప్రొఫెసర్ శరదిందు పాండే టీమ్ మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ ఆదివాసీ మ్యూజియాన్నిసందర్శించారు. ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచనల మేరకు ఐఐఎఫ్ఎం బృందం మేడారం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయగా, మ్యూజియంలో గిరిజనుల సంప్రదాయ జీవన విధానం, సంస్కృతి, కళలు, ఆచారాలు, అటవీ ఆధారిత జీవనోపాధికి సంబంధించిన ప్రదర్శనలను బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా మ్యూజియంలో ప్రదర్శిస్తున్న గిరిజన సంప్రదాయ వస్తువులు, కళాకృతులు, ఆచారాలు, జీవన విధానానికి సంబంధించిన అంశాలను పరిశీలించి, తెలంగాణ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతలు, సంస్కృతి పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఐఐఎఫ్ఎం బృందం పర్యటనలో భాగంగా గిరిజనుల అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల సేకరణ, విలువ జోడింపు,ఎకోటూరిజం, గిరిజన సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తోంది. ఈ పర్యటన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడింది.

# ఆర్పీ పట్నాయక్‌ను కలిసిన రఘునాథాచార్యులు



**వెంకటాపూర్ (రామప్ప ), అక్టోబర్ 07(జనం సాక్షి ):-** తెలుగు సినీ పరిశ్రమలో లెజెండ్ సంగీత దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న ఆర్పీ పట్నాయక్ ను వెంకటాపూర్ మండల కేంద్రంలోని రామాలయ పూజారి ముడుంబ రఘునాథాచార్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంగీత ప్రియులను అలరించే మరిచిపోలేని ఎన్నో మధుర గీతాలను అందిస్తున్నందుకు అభినందిస్తూ ఆయనను సత్కరించారు. సమాజంలో అన్ని రంగాల వారిని ప్రభావితం చేసేలా మీ సంగీతం, పాటలు, చిత్రాలు ఉన్నాయని ప్రశంసించారు. సమయం చూసుకొని యునెస్కో గుర్తింపుపొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించాలని ఆయనకు అన్నారు. తన కోడలు శ్రీరాగాను ఆయనకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్ అప్రజాస్వామికం

### రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్



**ఏటూరునాగారం అక్టోబర్ 07 ( జనం సాక్షి).** దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత అప్రజాస్వామికమని రాష్ట్రరోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల తొలగింపు వ్యవహారంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ తలపెట్టారు. ఈ క్రమంలో పోలీసులు ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా శాంతియుత ర్యాలీ తలపెట్టారు. ఈ క్రమంలో పోలీసులు శాంతియుతంగా వెళ్తున్న నేతలను అడ్డుకుని అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమని శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ సమావేశంలో మండల యూత్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్గమధ్యలో పాస్పోర్ట్ కోల్పోయిన యువకుడు



**కడెం: అక్టోబర్ 7(జనం సాక్షి)** కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు నాగరాజు అనే యువకుడు,తన పాస్పోర్ట్ ను బస్ లో ప్రయాణిస్తుండగా కోల్పోయాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 25వ తారీకు రోజున మాదాసు నాగరాజు తన పని నిమిత్తం ఇంటి నుండి బయలుదేరి వెళ్లి కడెం నుండి ఖానాపూర్ కు బస్ లో వెళుతున్న సమయంలో మార్గమధ్యలో తన ఖ8705949 నెంబర్ గల ఒరిజినల్ పాస్పోర్ట్ కోల్పోవడం జరిగింది అని అన్నాడు. పాస్పోర్ట్ కోల్పోయిన అనంతరం ఆనాటి నుండి నేటి వరకు ఎంత వెతికిన దొరకలేదు అని అన్నాడు. సోషల్ మీడియా తదితర వాటిలో ప్రసారం చేసిన కూడా కోల్పోయిన పాస్పోర్ట్ ఆచూకీ దొరకపోవడంతో, పాస్పోర్ట్ అధికారులు స్పందించి మరల కొత్త పాస్పోర్ట్ ఇప్పించగలరు అని మాదాసు నాగరాజు అధికారులను కోరుతున్నాడు.

## ఈవిఎం గోదాము వద్ద పటిష్ట భద్రతకు చర్యలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07(జనంసాక్షి ):** జిల్లా కేంద్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాం వద్ద పటిష్ట బందోబస్తు, సి.సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం గోదామును తనిఖీ చేసి సీలు, సి.సి. కెమెరాల పర్యవేక్షణ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని, 24 గంటల పాటు సి.సి. కెమెరాల పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్యాంలాల్, సిబ్బంది ముసావీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు

### బాలుర పాఠశాలలో వ్యాసరచన పోటీలు



**మహాదేవపూర్: సెప్టెంబర్ 7 (జనంసాక్షి);** డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రోజున మహాదేవపూర్ అటవీ శాఖ పరిధిలో 72వ అటవీ వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను మహాదేవపూర్ ,పలిమెల, మండలాల్లో గత వారం రోజులుగా, డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి మరియు రేంజ్ అధికారి ఆర్ రవితో పాటు ఫారెస్ట్ అధికారుల సమక్షంలో వన్యప్రాణుల సంరక్షణకై అటవీ గ్రామాల తో పాటు ప్రభుత్వ పాఠశాలలు గ్రామ పంచాయతీల్లో వన్యప్రాణుల రక్షణ అడవులను రక్షించడంలో ఎంత ప్రాధాన్యత ఉంటుంది అనే అంశంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ వన్యప్రాణుల సంరక్షణకు విస్తృతంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా గత ఐదు రోజుల నుండి 72వ జాతీయ వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల కార్యక్రమాన్ని ఫారెస్ట్ అధికారులు నిర్వహిస్తున్నారు. అలాగే కాళేశ్వరంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణతో అడవులను రక్షించుకొనుట పై కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డిగ్రీ ఇంటర్ కళాశాలలో కూడా సబ్ డి ఎఫ్ ఓ సందీప్ రెడ్డి రేంజర్ రవికుమార్‌తో పాటు అటవీ శాఖ సిబ్బంది విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు భాగంగా, వన్యప్రాణులను రక్షణకై వివరించడం జరిగింది. జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మహాదేవపూర్ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో స్వల్పాల కీర్తన ఆకుతోట తేజస్విని కొండ నవీన్, ప్రథమ మరియు ద్వితీయ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. చిత్రలేఖలో చెన్నూరి శ్రావణ్ ప్రథమ బహుమతి అలాగే స్వల్పాల నక్షత్ర ద్వితీయ బహుమతి జనగామ అంజరాజు తృతీయ బహుమతులు పొందారు. గెలుపొందిన విద్యార్థులకు ఎఫ్ ఆర్ ఓ ఆర్ రవి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి హసీనాభాను. ఎంపీపీప్రకాష్ రెడ్డి. ఆర్బి జగన్మోహన్ రెడ్డి. పలు శాఖల అధికారులు . వార్డు సభ్యులు. ఉపాధ్యాయుడు అనిల్ కుమార్ ఉపాధ్యాయులు రాజిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,రాజయ్య దేవేందర్ రెడ్డి ,లచ్చయ్య అనిల్ ,కవిత, షాజహా, కిరణ్ శ్రీనివాస్‌లు ఉన్నారు. అలాగే అటవీ శాఖ డిఆర్ ఓ జ్యోతి ఎఫ్ బి ఓ ఆర్ సదానందం సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

### పసుపు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన సదస్సు



**దిలావర్‌పూర్, అక్టోబర్ 7 (జనం సాక్షి):** మండలంలోని గుండంపల్లి గ్రామ రైతు వేదికలో ఉద్యాన శాఖ, ఆవైల్ (రాజుఖుశీ) ఫౌండేషన్, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో పసుపులో ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, నిపుణులు హాజరై రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డా. రాహుల్ మాట్లాడుతూ సాంప్రదాయ సాగు పద్ధతులకు బదులుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి, నాణ్యమైన పసుపు దుంపలను ఎంపిక చేసుకోవడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు. నేషనల్ స్పైస్ బోర్డు ప్రతినిధి ఉపేందర్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో నాణ్యమైన పసుపుకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. స్పైస్ బోర్డు ద్వారా రైతులకు అందుతున్న రాయితీలు, వివిధ సహాయ సహకారాలను వివరించారు. ఉద్యాన శాఖాధికారి మౌనిక మాట్లాడుతూ ఉద్యాన రంగానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడిని పాటిస్తూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో వరి సాగును తగ్గించి జొన్న, మినుము, పెసర, ఆవాలు, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. ఆవైల్ ఫౌండేషన్ సీఈఓ రమేష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక అవగాహన కల్పించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఉద్యాన శాఖ హెచ్ఈఓ దేవన్న, మాక్స్ సొసైటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. పసుపు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగు చేస్తున్న రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పంటలకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## వీబీజీ రాంజీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### డిఆర్ డిఓ పి డి విజయలక్ష్మి



**కడెం: అక్టోబర్ 7 (జనం సాక్షి)** వీబీజీ రాంజీ పథకం పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డీఆర్‌డీఓ పిడి విజయలక్ష్మి అన్నారు. బుధవారం కడెం మండలం మద్దిపడగ, కన్నాపూర్ గ్రామపంచాయతీల్లో వీబీజీ రాంజీ పథకంలో భాగంగా జరుగుతున్న ఫారంపాండ్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల పంట పొలాలకు రహదారుల నిర్మాణం, నూతన పంట కాలువలు, గొర్రెల షెడ్లు, పశువుల షెడ్లు, పొలాల్లో ఫారంపాండ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టుకుని రైతులు లాభాలు సాధించవచ్చని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో 60 మంది కూలీలు ప్రతిరోజూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాల్లో ఫారంపాండ్ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చేతులెత్తి మద్దతు తెలుపుతూ డీఆర్‌డీఓకు తెలియజేశారు. అలాగే వీబీజీ రాంజీ పథకంలో పనిచేస్తున్న సభ్యులను పనుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడెం ఈజీఎస్ ఏపీఓ జయదేవ్, స్థానిక గ్రామాల సర్పంచ్‌లు పంజాల శకుంతల రామాగౌడ్, ఎం. శంకర్, ఉపసర్పంచ్ దాసరి రమణయ్య, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, రిజ్వాన్, వార్డు సభ్యులు పల్లె నారాయణ, సారుగు లత, బైరి ఆశ, గ్రామ పెద్దలు, ఈజీఎస్ టీఏ గణేష్, ఎఫ్ఏలు శంకర్, హేమలత, వీబీజీ రాంజీ సభ్యులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ పీడీ తీరుపై ఎమ్మార్పీఎస్ ఆగ్రహం కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరిక



**తాండూర్, అక్టోబర్ 07(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం దళిత సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ భార్య, అంగన్‌వాడీ టీచర్ మీనాపై ఐసీడీఎస్ పీడీ రవుఫ్ ఖాన్ దర్యాప్తు పేరుతో భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండించింది. బాధితురాలిని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఐసీడీఎస్ పీడీ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, మాదారానికి చెందిన తన మిత్రుడి కుటుంబానికి రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు పన్నాగం పన్నారని ఆరోపించారు. తప్పుడు ఆధారాలు సృష్టిస్తూ, దళిత సర్పంచ్, ఆయన భార్యపై ఉత్తరాలు రాస్తూ భయభ్రాంతులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని, దళితులపై ఇటువంటి బెదిరింపులను సహించేది లేదని స్పష్టం చేశారు. ఒక ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారా లేక మిత్రుడి లబ్ధి కోసం పనిచేస్తున్నారా అని వారు ప్రశ్నించారు.

**ఈ విచారణ ప్రక్రియపై ఎమ్మార్పీఎస్ నాయకులు పీడీని పలు ప్రశ్నలు సంధించారు:**

ఫిర్యాదు చేసిన హనీఫ్ అనే వ్యక్తిని నేరుగా కలిసి విచారించారా? మూడు సంవత్సరాల క్రితం కుటుంబ అవసరాల కోసం అంగన్‌వాడీ సెంటర్ నిర్వహిస్తున్న తన సొంత ఇంటిని అమ్ముకుని, అదే ఇంట్లో అద్దె ప్రాతిపదికన సెంటర్ నడుపుతున్న విషయంపై విచారణ చేశారా? సదరు అంగన్‌వాడీ సెంటర్ యాజమాన్య హక్కులు ఇల్లు కొనుక్కున్న వ్యక్తికి ఎందుకు మార్చబడలేదు అనే కోణంలో దర్యాప్తు చేశారా? అంగన్‌వాడీ సెంటర్‌లో నమోదైన లబ్ధిదారుల ప్రతి ఇంటికి వెళ్లి సరైన విచారణ చేపట్టారా? ఆమె విధులకు హాజరు కావడం లేదనే విషయాన్ని ఏ విధంగా నిర్ధారించారు? రాజకీయ స్వప్రయోజనాల కోసం పనిచేస్తూ, దళిత సర్పంచ్ కుటుంబంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న ఐసీడీఎస్ పీడీని వెంటనే సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ తరపున జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా స్థాయిలో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో తాండూరు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, మండల ఇన్‌చార్జ్ జిలకర శంకర్, కాసిపేట కృష్ణ, ఆయిల్ల గణేష్, మాదారం పట్టణ అధ్యక్షులు సముద్రాల ఆనంద్, తరంగ్ అశోక్, రాము, ఆసంపల్లి శ్రీనివాస్, ఆయిల కుమార్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు.. కొలువుల పండుగ!

- 9న పుష్ప గార్డెన్స్‌లో మెగా జాబ్‌మేళా
- భారీగా కంపెనీల రాక



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవతో రెండోసారి మెగా జాబ్‌మేళా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గార్డెన్స్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్‌మేళా జరగనుంది. వివిధ రంగాలకు చెందిన పలు కంపెనీలు మేళాలో పాల్గొని అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. ఇప్పటికే ఒకసారి జాబ్‌మేళా నిర్వహించి పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన నేపథ్యంలో, రెండోసారి మరింత విస్తృత స్థాయిలో మేళా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎమ్మెల్యే చొరవతో.. రెండోసారి కొలువుల మేళా.**

మెగా జాబ్‌మేళా నిర్వహణపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం పుష్ప గ్రాండ్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేళా ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.. భారీ సంఖ్యలో యువత తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. టెంట్లు, సౌండ్ సిస్టం, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, భోజనం, టిఫిన్, తాగునీరు, రవాణా, విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లను సమీక్షించారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. వివిధ విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు కలిగిన యువత పెద్ద సంఖ్యలో హాజరై తమ అర్హతలకు సరిపడే ఉద్యోగ అవకాశాలను పొందాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మేళాను విజయవంతం చేయాలని ఆదేశించారు.

**గతంలో 2,770 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు**

గతంలో నిర్వహించిన జాబ్‌మేళాలో సుమారు 2,770 మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని అధికారులు తెలిపారు. ఈసారి అంతకంటే విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నందున భారీ సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**15 రిజిస్ట్రేషన్ కౌంటర్లు**

అభ్యర్థుల సౌకర్యార్థం మొత్తం 15 రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు ఎనిమిది కౌంటర్లు, భూపాలపల్లి పట్టణానికి ఒక ప్రత్యేక కౌంటర్‌తో పాటు మరో నాలుగు నుంచి ఐదు జనరల్ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి కౌంటర్‌లో మండల విద్యాశాఖ అధికారులతో పాటు నలుగురు సిబ్బందిని అందుబాటులో ఉంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

**గ్రామీణ యువతకు ఉచిత రవాణా సౌకర్యం**

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గ్రామాల నుంచి అభ్యర్థులను ఉదయాన్నే జాబ్‌మేళా ప్రాంగణానికి తీసుకొచ్చేందుకు ఆటోలు, టాటా ఏస్ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సర్పంచులు, ఎంపీడీవోలు సమన్వయంతో రవాణా ఏర్పాట్లు చేపట్టాలని, అభ్యర్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**పదో తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు**

10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, డీఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో ఈ నెల 9న ఉదయం 7 గంటలకు పుష్ప గార్డెన్స్‌కు చేరుకోవాలని సూచించారు.

**విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలి**

భారీ సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున జాబ్‌మేళా ప్రాంగణంలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అభ్యర్థుల రాకపోకలు, రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూలు, భోజనం తదితర అంశాల్లో సమన్వయం ఉండేలా శాఖల వారీగా బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జెన్కో సీఈ శ్రీ ప్రకాష్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన ఏఎస్సైకి సన్మానం



**బెల్లంపల్లి, అక్టోబర్ 7, (జనంసాక్షి)** బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఏఎస్సైగా పదోన్నతి పొందిన స్వప్నను బుధవారం సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 2009 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్ స్వప్న బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ ఏఎస్సైగా పదోన్నతి పొందింది. పదోన్నతి అనంతరం ఆమె తాండూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయింది. ఈసందర్భంగా స్వప్నను శాలువా, పూలమాలతో సత్కరించి, ఆమె సేవలను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలికారు. సిబ్బంది అందరూ తమ ఉద్యోగ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్సై డి రామకృష్ణ రావు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నెన్నెలలో పంచాయతీ కార్యదర్శులు వి.బి.జీ. రామ్ సిబ్బంది సమీక్ష సమావేశం



**నెన్నెల, అక్టోబర్ 7 (జనం సాక్షి )** నెన్నెల మండల కార్యాలయంలో ఎంపీడీఓ పూర్ణచంద్రరావు అధ్యక్షతన బుధవారం పంచాయతీ కార్యదర్శులు, వి.బి.జీ. రామ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. జలసిరి పనులు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, వీఓ భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనుల పురోగతిని అధికారులు సమీక్షించారు. ప్రతి గ్రామపంచాయతీలో రోజుకు కనీసం 100 మంది కూలీలు పనిలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, వి.బి.జీ. రామ్ సిబ్బందిని ఎంపీడీఓ ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న గ్రామీణాభివృద్ధి పనులను వేగవంతం చేసి, కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ మహేందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈనోష్, ఎంపీఓ వేదాల శ్రీనివాస్, ఏపీవో నరేష్, ఈసీ స్వామి, పంచాయతీ కార్యదర్శులు, వి.బి.జీ. రామ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా

## అధికారుల పనితీరు పై అసహనంవ్యక్తం చేసిన సర్పంచులు



**చింతలమానేపల్లి అక్టోంబర్ 7 (జనం సాక్షి )** మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో బుధవారం ఎంపీడీవో పి.సత్యనారాయణ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సర్పంచులు అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించడంతో నీటి వృథాను అరికట్టడంతోపాటు దోమల బెడద తగ్గుతుందని ఏపీవో సయ్యద్ హమీద్ తెలిపారు. కూలీల చెల్లింపుల్లో ఆన్‌లైన్ సమస్యలతో ఆలస్యం జరుగుతోందని, వేసవిని దృష్టిలో పెట్టుకుని పశువుల నీటి తొట్టెలకు స్థలాలు గుర్తించాలని సూచించారు.పంట నమోదు కోసం వాలంటీర్లను నియమించామని వ్యవసాయ అధికారి కార్తిషా చెప్పగా, గంగాపూర్ సర్పంచ్ మదినక్క తమకు వాలంటీర్ల వివరాలే తెలియవని ప్రశ్నించారు. ఇకపై సర్పంచుల సమన్వయంతో పంట నమోదు చేపడతామని అధికారి తెలిపారు.రవీంద్రనగర్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టును దసరా సెలవుల అనంతరం భర్తీ చేస్తామని విద్యాశాఖ అధికారి తెలిపారు. అంగన్వాడీకి ప్రత్యేక భవనం, మిషన్ భగీరథ జంక్షన్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని సర్పంచులు కోరారు. విద్యుత్ సమస్యలపై పలువురు సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారి రెండు సమావేశాలకు హాజరు కాకపోవడంపై ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మండల కేంద్రంలో పశు వైద్యశాల నిర్మించాలని డాక్టర్ శ్రీకాంత్ కోరారు. అంగన్వాడీల్లో నాణ్యమైన పోషకాహారం అందడం లేదని గంగాపూర్ సర్పంచ్ ఆరోపించారు. అధికారులు పూర్తిస్థాయిలో సమావేశాలకు హాజరుకావాలని కర్జెల్లి సర్పంచ్ చౌదరి నారాయణ కోరారు.సమావేశంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు..

- అటవీ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు.. మట్టి తవ్వుతున్న జేసీబీ పట్టివేత
- తవాహనాన్ని మహాదేవపూర్ డిపోకు తరలింపు.. అక్రమ తవ్వకాలపై దర్యాప్తు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అటవీ ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా జేసీబీతో మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు.

మహాదేవపూర్ అటవీ శాఖ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో రేంజ్ సిబ్బంది, అటవీ బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది సూరారం బీట్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో జేసీబీతో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే జేసీబీని స్వాధీనం చేసుకుని అటవీ శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న జేసీబీని మహాదేవపూర్ అటవీ శాఖ డిపోకు తరలించారు.

**అటవీ భూమిలో మట్టి తవ్వకాలపై దర్యాప్తు..**

అటవీ ప్రాంతంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టడం, అటవీ భూమిని దెబ్బతీయడం వంటి అంశాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అసలు ఎవరి ఆధ్వర్యంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి? తవ్విన మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారు? మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయా? అనే కోణాల్లో అటవీ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు..**

అటవీ ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు, చెట్ల నరికివేత, ఇతర అనధికార కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. సూరారం బీట్ పరిధిలో పట్టుబడిన జేసీబీ ప్రస్తుతం మహాదేవపూర్ అటవీ శాఖ డిపోలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించి కేసు దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

**వెన్నెల, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** కోనంపేటలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం పోలీసులు పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేకాటకు వినియోగిస్తున్న రూ.6,860 నగదు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పేకాటకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నా, పేకాట ఆడుతున్నా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, ప్రజల సహకారంతో అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి



- పంట పొలాలు ఎండి పోతున్నాయి
- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**కౌటాల అక్టోబర్ 07 (జనం సాక్షి) :** విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కాగజ్‌నగర్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు విద్యుత్ కోతలపై తీవ్రంగా స్పందించారు.రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, ముఖ్యంగా మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కోనేరు కోనప్ప అన్నారు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గతంలో కేసీఆర్ హయాంలో కౌటాల మండలం తాటిపల్లి గ్రామంలో మిర్చి పంటకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో అధిక దిగుబడులు సాధించిన రైతులు సంతోషం వ్యక్తం చేశారని, అప్పట్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కూడా నిర్వహించారని గుర్తు చేశారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు యూరియా కొరత, విద్యుత్ కోతలు, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కౌటాల మండలంలో 400 విద్యుత్ కనెక్షన్లు ఇప్పించి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం ద్వారా రైతుల కష్టాలను తీర్చామని పేర్కొన్నారు. గుండా యిపేటలో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని, జిల్లా యంత్రాంగం, జిల్లా మంత్రి ప్రత్యేకంగా స్పందించి మిర్చి పంట సాగు చేస్తున్న ప్రాంతాల్లో 24 గంటల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడించి, విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్న ప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని,రైతులు ఇంతగా ఆందోళన చేస్తున్నా అధికారులు, పాలకులు ఎందుకు స్పందిం చడం లేదని ప్రశ్నించారు. మాయమాటలు చెప్పడం కాకుండా రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని, రైతుల పంటలను కాపాడేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోనేరు కోనప్ప డిమాండ్ చేశారు.



# కేంద్ర నిధులతో మంచినీటి బోరు...

**కడెం, అక్టోబర్ 7(జనం సాక్షి) :** కడెం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో బుధవారం రోజున కేంద్ర నిధులతో మంజూరైన మంచినీటి బోర్ను అదిలాబాద్ ఎంపీ గేడం నగేష్ ఆదేశాల మేరకు బోర్ వెల్ ను బిజెపి నాయకులు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి కడెం మండల అధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ యాదవ్ స్థానిక గ్రామ సర్పంచ్ వద్నాల శిరీష బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు నాగవత్ శారద కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల సత్తన్న ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ మోహన్ నాయక్ మండల నాయకులు రాపర్తి శ్రీనివాస్ ధర్మపురి తిరుమలయ్య కర్ణాటక భీమన్న తదితరులు పాల్గొన్నారు.

# ముక్కు గోపికృష్ణారెడ్డి మాతృమూర్తి దశదినకర్మ

- పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి,రామగౌని మహీధర్ గౌడ్



**తాండూర్, అక్టోబర్ 06(జనం సాక్షి) :** సింగరేణి సివిల్ కాంట్రాక్టర్ శ్రీ ముక్కు గోపికృష్ణారెడ్డి మాతృమూర్తి దశదినకర్మ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోలేటి-బెల్లంపల్లి ఏరియా సివిల్ ఉ సెక్యూరిటీ కాంట్రాక్టర్ రామగౌని మహీధర్ గౌడ్‌తో పాటు పలువురు స్థానిక సివిల్ కాంట్రాక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని, దివంగత మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న ముక్కు గోపికృష్ణారెడ్డి ని, వారి కుటుంబ సభ్యులను మంత్రి వివేక్ వెంకటస్వామి మరియు రామగౌని మహీధర్ గౌడ్ పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రామగౌని మహీధర్ గౌడ్ మాట్లాడుతూ.. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని లోటును తట్టుకునే శక్తిని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని, వారికి మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియాకు చెందిన పలువురు ప్రముఖులు, కాంట్రాక్టర్లు మరియు సింగరేణి కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.